సోమవారం
05-08-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 45
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కొత్త అధినేత ఎన్నికకు హమాస్ సంప్రదింపులు

గాజా: తమ ఉద్యమాన్ని ముందుకు నడిపించేందుకు కొత్త నాయకుడిని ఎన్నుకునేందుకు సంప్రదింపుల ప్రక్రియను హమాస్ మొదలు పెట్టింది. తమ నాయకులతో పాటు అనుబంధ సంస్థలతో చర్చలు జరుపుతోంది. గత దశాబ్దాల్లో అనేక మంది హమాస్ నేతలు హతమయ్యారు. అయితే తమ ఉద్యమ నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ నేతలను ఎంపిక చేసుకోవడంతో హమాస్ ఎప్పుడూ ఆలశ్యం చేయలేదు. ఇప్పుడు కూడా కొత్త నాయకుడిని ఎన్నుకునేందుకు నడుం బిగించిందని ఓ ప్రకటన పేర్కొంది. హమాస్ పొలిట్ బ్యూరో అధ్యక్షుడు ఇస్మాయిల్ హనియేను ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో హత్యచేసిన విషయం తెలిసిందే.

అట్టుడికిన బంగ్లాదేశ్

- 'సహాయ నిరాకరణ' హింసాత్మకం
- 14 మంది పోలీసులు సహా 91 మంది మృతి
- హసీనా రాజీనామాకు విద్యార్థుల డిమాండ్
- నేడు భారీ ధర్నా-స్మారక ఫలకాల ఆవిష్కరణ

2లో

కేంద్ర మంత్రి గిరిరాజ్‌కు నిరసన సెగ

పాట్నా: ఓ శంకుస్థాపన కార్యక్రమం కోసం వచ్చిన కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్‌ను నిరసనకారులు చుట్టుముట్టారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు. అయితే నిరసనకారుల నుంచి తప్పించుకునేందుకు కేంద్ర మంత్రి బైక్‌పై అక్కడి నుంచి పారిపోయారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. బీహార్‌లోని బెగుసరాయ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బెగుసరాయ్ బీజేపీ ఎంపీగా ఉన్న కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ ఆదివారం డాక్ బంగ్లా

- మిగతా 2 లో

ఎస్సీ వర్గీకరణను అంగీకరించం

మాయావతి

లక్నో: ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తమ పార్టీ ఏకీభవించడం లేదని బీఎస్పీ అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతి అన్నారు. ఆదివారం ఆమె లఖనవూలో మీడియాతో మాట్లాడారు. షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీలు), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీలు)కు చెందిన వ్యక్తుల రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు అనుమతించడాన్ని తమ పార్టీ ఏమాత్రం అంగీకరించబోదన్నారు. అఘాయిత్యాలను ఎస్సీ, ఎస్టీ

- మిగతా 2 లో

శ్రీశైలం ప్రాజెక్టు

హాకీ సెమీస్‌లో టీమిండియా

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో భాగంగా పురుషుల హాకీలో టీమిండియా సెమీఫైనల్స్‌లో ప్రవేశించింది. పతకానికి ఒక్క అడుగు దూరంలో నిలిచింది. ఆదివారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో ప్రపంచ నం.2 ర్యాంకులో ఉన్న బ్రిటన్ జట్టుపై 1 (4)- 1 (2) తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో నేరుగా సెమీస్‌కు చేరుకుంది. తొలుత ఈ మ్యాచ్ 1-1తో టై అవ్వగా, ఆ తర్వాత షూటౌట్‌లో భారత్ 4-2తో గెలుపొందింది. తొలి క్వార్టర్‌లో ఇరు జట్లు ఒక్క గోల్ కూడా స్కోర్ చేయలేదు. అయితే రెండో క్వార్టర్‌లో భారత్ డిఫెండర్ అమిత్ రోహిదాస్ మ్యాచ్‌కు దూరమ య్యాడు. హాకీ స్టిక్‌తో బ్రిటన్ ఆటగాడిని ఉద్దేశపూర్వకంగా కొట్టాడని అక్కడి రిఫరీలు రోహిదాస్‌ను రెడ్ కార్డ్ ద్వారా గేమ్ నుంచి బయటికి పంపించారు. దీంతో భారత్ 10 మందితోనే ఆడాల్సి వచ్చింది. సరిగ్గా 22వ

- మిగతా 2 లో

సాగర్‌కు వరద పోటు

కృష్ణా ప్రవాహం ఉధృతం
నేడు క్రస్ట్ గేట్ల ఎత్తివేతకు సన్నాహాలు
పల్నాడు, గుంటూరు జిల్లాల అప్రమత్తం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/కర్నూలు: భారీ వర్షాలు, వరదలతో కృష్ణానది పరవళ్లు తొక్కుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో శ్రీశైలం, నాగార్జునసాగర్‌లు నిండుకుండలా మారాయి. గంట గంటకూ జలాశయాల్లో నీటి మట్టం పెరుగుతోంది. దీంతో ఇప్పటికే శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను అధికారులు పూర్తిగా ఎత్తివేశారు. సోమవారం సాగర్ క్రస్ట్ గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. పాలసముద్రం మాదిరి నురగలు కక్కుతూ సాగర్ వైపు కృష్ణమ్మ పరుగులు తీస్తున్నది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో వరదల కారణంగా ప్రాజెక్టులు నిండి పోవడంతో దిగువ శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. సుంకేసుల నుంచి 4,50,064 క్యూసెక్కులు, జూరాల నుండి2,98,573 క్యూసెక్కులు మొత్తం7,48,633 క్యూసెక్కుల నీరు చేరుతోంది. స్పిల్ వే ద్వారా 10 గేట్లు 20అడుగుల మేర ఎత్తి దిగువకు 5,50,731 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఏపీ జలవిద్యుత్ ప్రాజెక్టుకు 24,618 క్యూసెక్కులు, తెలంగాణ జలవిద్యుత్‌కు 38,050, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 25,000 క్యూసెక్కులు, హంద్రీనీవా ద్వారా 1013 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం పూర్తి నీటి మట్టం గరిష్ఠంగా 885.807 అడుగుల సామర్థ్యం ఉండగా..ప్రస్తుతం 882 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 215.టీ ఎంసీలు కాగా,

- మిగతా 2 లో

వక్ఫ్‌పై కేంద్రం పంజా

- బోర్డు అధికారాల కుదింపు, ఆస్తుల హరణకు కుయుక్తులు
- చట్టానికి 40 సవరణలు: కేబినెట్ ఆమోదం
- త్వరలో పార్లమెంటులో ప్రవేశం

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హిందూ రాజ్యస్థాపన దిశగా చర్యలకు వేగం పెంచింది. ముస్లింలను రెండవ తరగతి పౌరులుగా మార్చేందుకు కుట్ర చేస్తోంది. హిందూత్వ అజెండాలో భాగంగా ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం వక్ఫ్‌బోర్డులపై గురి పెట్టింది. దేశంలోని వక్ఫ్ ఆస్తుల స్వాధీనానికి కుతంత్రాలు చేస్తోంది. ఇందులో భాగంగానే వక్ఫ్ ఆస్తుల ధ్రువీకరణ/నిర్ధారణ, బోర్డుల అధికారాలను కుదిరించేందుకు వక్ఫ్ చట్టానికి 40 సవరణలను ప్రతిపాదించింది. ఇందుకు కేంద్ర కేబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే పార్లమెంటులో సవరిత చట్టాన్ని ప్రతిపాదించనున్నారు. ఇకపై వక్ఫ్ ఆస్తులను తమ సొంతవిగా చెప్పుకునేందుకు వీలు లేకుండా వక్ఫ్ చట్టాన్ని మోదీ ప్రభుత్వం సవరిస్తోంది. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణలో జిల్లా మెజిస్ట్రేట్లకు అధికారాలు ఇవ్వాలని భావిస్తోంది. కేంద్ర వక్ఫ్ మండలి, రాష్ట్ర బోర్డులో మహిళా ప్రతినిధ్యం పెంచే నెపంతో సంబంధిత చట్టాన్ని సంస్కరించేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుంది. సవరణ బిల్లుకు ఆమోదం లభిస్తేగనుక ఏ ఆస్తిని కూడా తమ సొంత ఆస్తిగా చెప్పుకునేందుకు వక్ఫ్ బోర్డుకు అధికారం ఉండదు. ప్రతిపాదిత సవరణల ప్రకారం వక్ఫ్‌బోర్డు ఆస్తుల నిర్ధారణ తప్పనిసరి అవుతుంది. దేశవ్యాప్తంగా ముస్లింల కోసం ఓ వ్యక్తి అందజేసే స్థలం

- మిగతా 2 లో

వాణిజ్య రాజధానికి ట్రాఫికర్!

- ఇరుకైన రోడ్లు... వేలాదిగా వాహనాల రాకపోకలు
- సిగ్నల్ పడితే... బండెనకబండి బారులు
- దశాబ్దాలుగా విజయవాడ వాసులకు తప్పని కష్టాలు

వాణిజ్య రాజధానిగా పేరుగడించిన విజయవాడకు దశాబ్దాలుగా ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. జనసాంద్రత పెరగడం, నగరం విస్తరణ అంతంత మాత్రంగా ఉండడం, వాహనాల సంఖ్య వేలల్లో పెరిగిపోవడం, ఇరుకురోడ్లు... చుట్టుపక్కల మండలాల ప్రజలు నిత్యం వచ్చిపోతుండడంతో ట్రాఫిక్ జఠిలమవడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. విద్య, వైద్యం, వాణిజ్య హబ్‌గా మారడంతో వాహనాలపై వచ్చిపోయే వారి సంఖ్యకు విశాలమైన రహదారులు లేకపోవడంతో ట్రాఫికర్ ఏర్పడుతోంది. వందలాది మంది పోలీసులు ముఖ్యమైన కూడళ్లలో నియంత్రణకు శ్రమిస్తున్నా, వాహనదారులను అదుపు చేయడం సవాలుగా మారింది. నిర్మాణంలో ఉన్న అవుటర్ రింగ్‌రోడ్‌లు వినియోగంలోకి వస్తే నగరంపై టాఫ్రిక్ భారం తగ్గే అవకాశం ఉంది.

విశాలాంధ్ర-డిజిటల్: ఆంధ్ర ప్రదేశ్ రెండో అతిపెద్ద నగరం విజయవాడ. అత్యధిక జనసాంద్రత కలిగి వాణిజ్య రాజధానిగా పేరుగాంచిన నగరంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు జఠిలం అవుతూనే ఉన్నాయి. ఇరుకైన రోడ్లు, వాహనాల సంఖ్య నానాటికీ పెరిగిపోతుండడం, చుట్టూ ఉన్న ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్, పెనమలూరు, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండల గ్రామాల నుంచి ప్రజలు విద్య, వైద్యం, వ్యక్తిగత, వ్యాపార, షాపింగ్‌కు ప్రతిరోజు వేలాదిగా వాహనాలపై వచ్చిపోతూ ఉంటారు. సిగ్నల్ పడితే చాలు వాహనాలు బారులుతీరుతాయి. కొన్నిసార్లు కనీసం పాదచారులు వెళ్లేందుకు కూడా వీలుండదు. ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన ఆటోనగర్‌కు నిత్యం భారీ నుంచి

- మిగతా 2 లో

ప్రణాళికాబద్ధంగా అమరావతి

ఐఐటీ బృందం నివేదిక కీలకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అమరావతిలో అసంపూర్తిగా మిగిలిన కట్టడాలపై ఐఐటీ బృందం ఏం నివేదిక ఇస్తుంది? అనే దానిపైనే అందరి చూపు ఉంది. కూటమి ప్రభుత్వమూ ఆ నివేదికపై ఆసక్తిగా ఎదురు చూస్తోంది. నివేదిక ఆధారంగా అభివృద్ధి పనులతో ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమరావతి రాజధానే ప్రధాన లక్ష్యంగా నిర్ణయించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లను వివిధ ఏజెన్సీల ద్వారా అమరావతికి కేటాయిస్తామని ప్రకటించింది. మరోవైపు సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే అమరావతి ప్రాంతంపై ప్రధాన దృష్టి కేంద్రీకరించారు. ఆ ప్రాంతంలోని పిచ్చి మొక్కల తొలగింపు కోసం ప్రత్యేక నిధులు కేటాయించారు. రాజధాని ప్రాంతాన్ని పాత డిజైన్‌తోనే రూపొందించాలని నిర్ణయించారు. ఏపీ సీఆర్డీఏ విస్తీర్ణం పాత విధానంలోనే ఉంచి రాజధానికి సమగ్ర రూపం తెచ్చేందుకు కసరత్తు చేస్తున్నారు. పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ నిరంతరం అమరావతి దృష్టితోనే పర్యటనలు చేస్తూ, అభివృద్ధి పనులకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. రెండున్నరేళ్లుగా మధ్యలోనే నిలిచిపోయిన భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నారు.

గత ప్రభుత్వంలో రాజధాని పనుల నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం రాజధాని నిర్మాణ పనులను నిర్లక్ష్యం చేయడంతో కట్టడాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో వాటిని అలాగే కొనసాగించాలా?, ప్రత్యామ్నాయంగా నిర్మించాలా? తెలియక కూటమి ప్రభుత్వం ఆ బాధ్యతలను మద్రాస్, చెన్నై ఐఐటీ బృందాలకు అప్పగించింది. రాజధానిలో అసంపూర్తిగా నిలిచిన కట్టడాల సామర్థ్యాన్ని అధ్యయనం చేసేందుకు ఐఐటీ నిపుణుల బృందం

- మిగతా 2 లో

100 రోజుల కార్యాచరణ

నేడు కలెక్టర్లతో సీఎం సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కూటమి ప్రభుత్వం తొలిసారిగా సోమవారం కలెక్టర్లతో సమావేశం నిర్వహించనుంది. రానున్న 100 రోజుల కార్యాచరణ, భూ కబ్జాలు, కుంభకోణాలపై చర్చించనున్నారు. అసైన్డ్, చుక్కల భూములు, ఫ్రీహోల్డ్, అక్రమ రిజిస్ట్రేషన్లు తదితర అంశాలపై ఆరా తీస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణల ఆరోపణలపైనా దృష్టి పెడతారు. జిల్లాల వారీగా భూ అక్రమాల డేటాను తీసుకురావాలని కలెక్టర్లకు ఆదేశాలు వెళ్లాయి. సంక్షేమ పథకాలు, ఇసుక పాలసీ అమలు విధానంపైనా చర్చిస్తారు. రాష్ట్ర సచివాలయంలో జరుగనున్న కలెక్టర్ల సమావేశానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అజెండాను ప్రభుత్వం రూపొందించింది. ఆయా శాఖల కార్యదర్శులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వీడియో సమావేశం

- మిగతా 2 లో

ఇదీ లోకం!

కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

మూడు ఏసీ బోగీలు దగ్ధం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆగి ఉన్న రైలులో మంటలు చెలరేగాయి. ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బా నుంచి ఆదివారం ఉదయం విశాఖ చేరుకున్న ఎక్స్‌ప్రెస్ (18517) రైలు బోగీల్లో ఈ మంటలు వ్యాపించాయి. స్టేషన్‌లోని నాల్గవ నంబర్ ప్లాట్‌ఫామ్‌పై ఈ ఘటన జరిగింది. మూడు ఏసీ బోగీలు దగ్ధమయ్యాయి. బీ7 బోగీలోని మరుగుదొడ్డిలో షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బీ7 బోగీతో పాటు బీ6, ఎం1 బోగీలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఘటన జరిగిన సమయంలో రైలులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. రైల్వే సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. మరోవైపు బోగీలు దగ్ధమవుతుండడంతో రైల్వేస్టేషన్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకుంది. రైలులో అగ్ని ప్రమాద ఘటనపై హోంమంత్రి అనిత డీఆర్‌ఎంతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

విశాఖ సంయుక్త సీపీ ఫకీరప్ప మాట్లాడుతూ అగ్నిప్రమాద ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని తెలిపారు. రైలులో నుంచి ప్రయాణికులందరూ దిగిపోయారని చెప్పారు. నేడు ఉదయం 10 గంటలకు మంటలు చెలరేగాయన్నారు. వెంటనే రైల్వే సిబ్బంది, పోలీసులు అప్రమత్తమయ్యారని తెలిపారు. నాలుగు అగ్నిమాపక యంత్రాల ద్వారా మంటలార్పారని చెప్పారు. దగ్ధమైన బోగీలను రైలు నుంచి వేరు చేసి తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. అగ్నిప్రమాద ఘటనపై రైల్వే సిబ్బంది పరిశీలిస్తున్నారని ఫకీరప్ప వివరించారు.

ఏపీలో ముఠా పాలన: జగన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ప్రజాస్వామ్య ప్రభుత్వం స్థానంలో... ముఠాల పాలన కనిపిస్తోందని వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. ఈ రెండు నెలల కాలంలో ఏపీ అంటేనే రాజకీయ హింసకు మారుపేరుగా మారిపోయిందని, ఈ పరిస్థితిలో ఏమాత్రం మార్పు రావడంలేదంటూ ఎక్స్‌వేదికగా ఆదివారం జగన్ ట్వీట్ చేశారు. ప్రభుత్వంలో పెద్దల ప్రోత్సాహంతో జరిగే ఘటనలు, అధికారంలో తమపార్టీ ఉందనే ధీమాతో చేస్తున్న దాడులు, రాజకీయ ప్రేరేపిత దుశ్చర్యలు రాష్ట్రంలో ప్రతిరోజూ జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. నంద్యాల జిల్లాలో నిన్న రాత్రి జరిగిన హత్య, ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో జరిగిన దాడి ఘటన వీటికి నిదర్శనాలేనని, ప్రజలకిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోవడంతో, ఎవరూ ప్రశ్నించకూడదని, రోడ్డుపైకి రాకూడదని ప్రజలను, నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేయడానికి ఇలాంటి దుర్మార్గాలకు పాల్పడుతున్నారని వివరించారు. బాధితులకు అండగా ఉంటూ, పోరాటాన్ని కొనసాగిస్తామని జగన్ పునరుద్ఘాటించారు.

ఇజ్రాయిల్-నాటోకు మద్దతివ్వొద్దు

సైప్రస్ ప్రభుత్వానికి సీఐసీ, ఏకేఈఎల్ పిలుపు

ఏథెన్స్: ఇజ్రాయిల్, నాటో యుద్ధంలో సైప్రస్ ప్రభుత్వ జోక్యం వద్దని 'కమ్యూనిస్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ సైప్రస్' (సీఐసీ) పిలుపునిచ్చింది. అమెరికా, ఇజ్రాయిల్ కొనసాగించే మారణహోమం కోసం వినియోగమయ్యే యుద్ధ యంత్రాంగానికి ఇంధనం అందించవద్దని కమ్యూనిస్ట్ ఇనిషియేటివ్ ఆఫ్ సైప్రస్, ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ ది వర్కింగ్ పీపుల్ (ఏకేఈఎల్) వేర్వేరు ప్రకటనలు చేశాయి. పలస్తీనాలో పేట్రేగిన హింసపై ఆందోళన వ్యక్తంచేశాయి. పలస్తీనా ప్రజల మారణహోమం వేళ రిపబ్లిక్ ఆఫ్ సైప్రస్‌లోని అన్ని పోర్టులు, ఎయిర్‌పోర్టుల్లో పెరిగిన కదలికలు... సైప్రస్ నుంచి పర్యాటకుల తరలింపుపై సీఐసీ ఆందోళన వ్యక్తంచేసింది. పశ్చిమాసియాలో సైనిక, గూఢచర్య ప్రణాళికల విస్తరణ, పెరిగిన నౌకల రాకపోకలు పెరిగాయని, అమెరికాకు చెందిన 200 మంది మరైన్ సైనికుల మోహరింపు వంటి అంశాలను సీఐసీ తన ప్రకటనలో ప్రస్తావించింది. నాటో ప్రణాళికల్లో సైప్రస్ దేశం జోక్యం వద్దని కోరింది. పలస్తీనా ప్రజల రక్తం చేతికి అంతించుకోవద్దని తమ ప్రభుత్వానికి హితవు పలికింది. ప్రోగ్రెసివ్ పార్టీ ఆఫ్ ది వర్కింగ్ పీపుల్ (ఏకేఈఎల్) కేంద్ర కమిటీ కూడా ఒక ప్రకటనలో ఇజ్రాయిల్ యుద్ధ ప్రణాళికల్లో సైప్రస్ జోక్యాన్ని ఆక్షేపించింది. 'ఓవర్‌సీస్ సంటోరిని' అనే నౌకకు ఎటువంటి సౌకర్యాలు అందకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరింది. సైప్రస్‌లో ఇంధనం నింపుకోవడం లేక డాకింగ్‌కు ఆస్కారం కల్పించి ఇజ్రాయిల్ యుద్ధ కార్యకలాపాలకు దోహదం కావద్దని పిలుపునిచ్చింది. గత ఏప్రిల్‌లో ఐరాస మానవ హక్కుల మండలి తీర్మానాన్ని గుర్తుచేసింది. యుద్ధ నేరాలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాల విక్రయం, సరఫరా, ఇంధనం సరఫరా వంటి చర్యలపై ఐరాస తీవ్ర ఆందోళన వ్యక్తం చేయడాన్ని ఏకేఈఎల్ పేర్కొంది. యుద్ధ నౌకను తమ దేశంలో ఉండనివ్వడం, దాడుల్లో జోక్యం చేసుకోవడం వల్ల అపాయాన్ని కొని తెచ్చుకున్న వాళ్లమవుతామని సైప్రస్ ప్రభుత్వాన్ని కమ్యూనిస్టు వర్గాలు హెచ్చరించాయి.

ఎన్నికల లెక్కలు బయటపెట్టాలి

వెనిజులాకు ఏడు ఈయూ దేశాల పిలుపు

బ్రస్సెల్స్: వెనిజులా అధ్యక్ష ఎన్నికల వివాదం దృష్ట్యా ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే లెక్కను బహిర్గతం చేయాలని ఏడు ఈయూ దేశాలు పిలుపునిచ్చాయి. పోలింగ్ కేంద్రాల నుంచి సమీకరించిన డేటాను ప్రజల ముందర ఉంచాలని, తద్వారా అధ్యక్ష ఎన్నికలలో ఓటింగ్ పారదర్శకంగా జరిగిందని నిరూపించాలని వెనిజులాకు స్పెయిన్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, నెథర్లాండ్స్, పోలాండ్, పోర్చుగల్ ఉమ్మడి ప్రకటనలో సూచించాయి. వెనిజులా ప్రజలు ఏం కోరుకున్నారో తెలియడం కోసం ఈ మేరకు ధృవీకరించడం ఎంతో అవసరమని పేర్కొన్నాయి. జులై 28న జరిగిన ఎన్నికల్లో నికోలాస్ మదురో 51శాతం ఓట్లతో గెలుపొందారని వెనిజులా ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే మదురో ఎన్నికను గుర్తించేందుకు అమెరికా సహా కొన్ని దేశాలు నిరాకరించాయి. విపక్ష అభ్యర్థి గోంజాల్వెజ్ గెలిచినట్లు పేర్కొన్నాయి. ఇదే క్రమంలో ఏడు ఈయూ దేశాల తాజా ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది.

ఎవరినీ క్షమించేది లేదు: మదురో

వెనిజులాలో ప్రజాందోళనలు మిన్నంటాయి. ఎన్నికల ఫలితాలను వ్యతిరేకిస్తూ వేలాది మంది నిరసనలు తెలుపుతున్నారు. దీంతో ఇప్పటివరకు రెండు వేల మందికి నిర్బంధానికి గురయ్యారు. మౌలిక వసతులకు నష్టం వాటిల్లజేయడమే కాకుండా ఉగ్రవాదాన్ని, ద్వేషాన్ని రెచ్చగొడుతున్నట్లు వారిపై ఆరోపణలు ఉన్నాయి. 2014, 2017లో జరిగినట్లు ఇప్పుడు కూడా 60-120 రోజుల వరకు దాడులు, అల్లర్లు, హింస జరుగుతుందని వారు అనుకున్నారు కానీ సైన్యం-పోలీసులు వెంటనే స్పందించడంతో 48 గంటల్లోనే అంతా సర్దుమణిగింది అని నిరసనలనుద్దేశించి మదురో అన్నారు. ఆయన అధ్యక్ష భవనం వద్ద ర్యాలీలో మాట్లాడుతూ ఇప్పటికే 2వేల మంది నిర్బంధంలో ఉన్నారు. వారిని అత్యంత భద్రతతో కూడుకున్న జైళ్లు టోకోరన్, టోకుయిటోకు తరలిస్తాం. గరిష్ఠ శిక్ష విధిస్తాం. చట్టం ఈసారి ఎవరినీ క్షమించదు అని ఉద్ఘాటించారు. నిర్బంధానికి గురైన వారికి అల్లర్లతో ప్రమేయం ఉందని రుజువు చేసేందుకు వాళ్లు చిత్రీకరించిన వీడియో సాక్ష్యం ఉన్నట్లు తెలిపారు.

మదురోకు మాస్కో మద్దతు:

అమెరికా, యూరప్ దేశాలు మదురో ఎన్నికను తిరస్కరించగా... మాస్కో మద్దతిచ్చింది. వెనిజులాలోని ప్రతిపక్ష పార్టీ ఓటమిని అంగీకరించాలని సూచించింది. వెనిజులాలో అస్థిర పరిస్థితులు సృష్టించేందుకు మద్దతివ్వొద్దని అంతర్జాతీయ ఒప్పందాలతో లేని దేశాల (థర్డ్ కంట్రీస్)ను క్రెమ్లిన్ హెచ్చరించింది.

ఇజ్రాయిల్‌పై హెజ్బుల్లా క్షిపణి దాడులు

బీరుట్: దక్షిణ లెబనాన్‌లో దాడులకు ప్రతీకారంగా, పలస్తీనా ప్రజలకు మద్దతుగా ఇజ్రాయిల్‌పై కత్యుషా క్షిపణులతో హెజ్బుల్లా విరుచుకుపడింది. లెబనాన్‌లోని కఫర్ కేలా, డెయిర్ సిరియానేపై దాడులకు బదులుగా ఉత్తర ఇజ్రాయిల్‌లోని బీట్ హిల్లేపై దాడి చేసినట్లు ప్రకటించింది. పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్మేశాయి. ఇటీవల హమాస్ అగ్రనేత హత్యకు గురి కావడంతో ప్రాంతీయ ఘర్షణ తీవ్రతరమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీకారం తీర్చుకుంటామని హమాస్ ప్రకటించింది. ఇరాన్ మద్దతున్న హెజ్బుల్లా కూడా ఇజ్రాయిల్‌పై దాడులు చేస్తామని హెచ్చరికలు చేసింది. ఇదే క్రమంలో ఇజ్రాయిల్ డ్రోన్లు, యుద్ధవిమానాలు శనివారం మధ్యాహ్నం లెబనాన్‌లోని పట్టణాలు, గ్రామాలపై ఆరుసార్లు దాడులు చేశాయి. సరిహద్దు వెంబడి తూర్పు, పశ్చిమ సెక్టార్లలోని ఎనిమిది పట్టణాలు, గ్రామాలపై 30 ఫిరంగులతో ఇజ్రాయిల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌లోని తయిర్ హర్ఫా, కఫర్ కిలాలోని అనేకభవనాలపై తమ యుద్ధ విమానాలు దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. రబ్ అల్ థలాతీన్‌లోని హెజ్బుల్లాకు సంబంధించిన స్థావరంపై తమ ట్యాంకులు ఫిరంగులతో దాడి చేసినట్లు వెల్లడించింది. దీంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది.

అట్టుడికిన బంగ్లాదేశ్

ఢాకా: బంగ్లాదేశ్ అట్టుడికిపోతోంది. దేశంలో మళ్లీ హింస చెలరేగింది. ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేయాలని, ప్రభుత్వం గద్దె దిగాలన్న ఏకైక డిమాండ్‌తో విద్యార్థులు వేలాది సంఖ్యలో వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. ఆదివారం నుంచి సహాయ నిరాకరణకు స్టూడెంట్స్ ఎగైనెస్ట్ డిస్‌క్రిమినేషన్ ఇచ్చిన పిలుపు మేరకు జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. 13 జిల్లాల్లో అల్లర్లు జరిగాయి. అవామీ లీగ్, ఛాత్ర లీగ్, జుబో లీగ్ కార్యకర్తలకు నిరసనకారులకు మధ్య ఘర్షణల్లో 91 మంది చనిపోయారు. మృతుల్లో 14 మంది పోలీసులు ఉన్నారు. వీరిలో 13 మంది సిరాజ్‌గంజ్ పోలీసు స్టేషన్‌లో చనిపోగా ఒకరు మాత్రం కొమిల్లా ఎలియట్‌గంజ్‌లో మృతి చెందినట్లు అధికారిక ప్రకటన తెలిపింది. వందల మంది నిరసనకారులు గాయపడినట్లు స్థానిక వార్తా సంస్థలు పేర్కొన్నాయి. దీంతో ఫేస్‌బుక్, మెసెంజర్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల షట్‌డౌన్‌కు, 4జీ మొబైల్ ఇంటర్నెట్ సేవల నిలిపివేతకు ఆదేశాలు జారీఅయ్యాయి. నిరవధిక కర్ఫ్యూను అధికారులు అమలు చేశారు. చర్చలకు రావాలని ప్రభుత్వం పిలిచినా విద్యార్థి నేతలు తిరస్కరించారు. తమ ఆందోళనలో కలిసిరావాలని స్కూళ్లు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, ప్రైవేటు వర్సిటీలు, మదర్సాల విద్యార్థులతో పాటు కార్మికులు, ఉద్యోగులు, రాజకీయ కార్యకర్తలు, ఇతర ప్రజా సంఘాల వారికి పిలుపునిచ్చారు. సోమవారం భారీ ధర్నా, ప్రదర్శన చేయబోతున్నట్లు ప్రకటించారు. కోటా ఉద్యమ అమరవీరుల స్మారక ఫలకాలు ఆవిష్కరించనున్నారు.

విద్యార్థులకు మాజీ సైన్యాధికారుల మద్దతు: విద్యార్థుల ఉద్యమానికి కొందరు మాజీ సైన్యాధికారులు మద్దతిచ్చారు. ఫేస్‌బుక్ ప్రొఫైల్‌ను ఎరుపు రంగులోకి మార్చి మాజీ చీఫ్ జనరల్ ఇక్బాల్ కరీం భుయాన్ సంఘీభావం తెలిపారు. రాజకీయంగా చర్చలు జరిపి ఈ సంక్షోభాన్ని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటువంటి కార్యాల్లో నిమగ్నం చేసి సాయుధ దళాల గౌరవానికి భంగం కలిగించవద్దని హితవు పలికారు. వీధుల్లో మోహరించిన బలగాలను ఉపసంహరించాలని ఇక్బాల్ కరీం భుయాన్ విజ్ఞప్తి చేశారు. ఢాకాలోని సైనిక కేంద్ర కార్యాలయంలో అధికారులతో మాట్లాడిన సైన్యాధికారి వకార్ ఉజ్ జమన్... బంగ్లాదేశ్ సైన్యం ప్రజల నమ్మకానికి చిహ్నమన్నారు. ఎప్పుడూ ప్రజల పక్షాన్నే నిలిచిందని, భవిష్యత్‌లోనూ అంతేనని చెప్పారు.

వీళ్లు విద్యార్థులు కాదు ఉగ్రవాదులు: షేక్ హసీనా

దేశంలో ఆందోళనలు చేస్తున్నది విద్యార్థులు కాదు ఉగ్రవాదులని, వీరిని అణచివేయాలని ప్రధాని హసీనా పిలుపునిచ్చారు. అదే క్రమంలో గణభాబన్ వద్ద భద్రతా వ్యవహారాలపై జాతీయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి త్రివిధ సైన్యాధికారులు, పోలీసులు, ఆర్ఏబీ, బీజీబీతో పాటు ఉన్నత భద్రతా అధికారులు హాజరయ్యారని పీఎంఓ వర్గాలు తెలిపాయి.

వ్యాపార సముదాయల మూసివేత:

నిరసనల దృష్ట్యా ఢాకాలోని చాలా వరకు దుకాణాలు, మాల్స్ మూతబడ్డాయి. నిరసనలో పాల్గొన్న వందల మంది విద్యార్థులు, వృత్తిదారులు ఢాకాలోని షాబాగ్ వద్దకు చేరుకొని అన్ని వైపుల నుంచి రహదారులు దిగ్బంధించారు. బంగబంధు షేక్ ముజిబ్ మెడికల్ యూనివర్సిటీ (బీఎస్‌ఎంఎంయూ) వద్ద అనేక వాహనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు డైలీస్టార్ వెల్లడించింది. ప్రైవేటు వాహనాలను కొందరు కర్రలతో ధ్వంసం చేశారు.

హాకీ సెమీస్‌లో టీమిండియా

(మొదటిపేజీ తరువాయి)

నిమిషంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా ఓ గోల్ సాధించి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. ఇక 27వ నిమిషంలో బ్రిటన్ ప్లేయర్ మోర్టన్ లీ గోల్ చేయడం వల్ల స్కోర్ సమం అయింది. ఆ తర్వాతి రెండు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. దీంతో మ్యాచ్ షూటౌట్‌కు దారితీసింది. భారత హాకీ జట్టు ఇప్పటివరకూ ఒలింపిక్స్‌లో 12 పతకాలను గెలుచుకుంది. అందులో 8 స్వర్ణాలు, 3 కాంస్యాలు, ఓ రజత పతకం ఉంది. దీంతో ఈ పారిస్ ఒలింపిక్స్‌లోనూ కూడా అదరగొట్టి మరో పతాకాన్ని ఖాతాలో వేసుకోవాలని భారత్ హాకీ జట్టు ఉవ్విళ్లూరుతోంది.

క్వార్టర్స్‌లో లవ్లీనా ఓటమి - చేజారిన మరో పతకం

పారిస్ ఒలింపిక్స్‌లో మహిళా బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ ఓటమి చవిచూసింది. క్వార్టర్ ఫైనల్‌లో చైనాకు చెందిన క్వియాన్ చేతిలో 1-4 పాయింట్ల తేడాతో ఓడి సెమీస్‌కు చేరే అవకాశాన్ని కోల్పోయింది. దీంతో భారత్ తన ఖాతాలో మరో పతకం అందుకునే అవకాశాన్ని కోల్పోయింది. అయితే 2020లో జరిగిన టోక్యో ఒలింపిక్స్‌లో లవ్లీనా 69 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. ఈ గెలుపుతో ఆమె అప్పట్లో సంచలనం సృష్టించింది.

నిరాశపర్చిన లక్ష్యసేన్...కాంస్యంపై ఆశ

షటిల్ బ్యాడ్మింటన్ సెమీస్‌లో లక్ష్యసేన్ ఓటమి పాలయ్యాడు డెన్మార్క్ ఆటగాడు అక్సెల్సన్ చేతిలో 20-22, 14-21 తేడాతో పరాజయాన్ని చవిచూశాడు. అయితే ఆగస్టు 5న జరగనున్న కాంస్య పతక పోరులో మలేసియా ప్లేయర్ లీ జీ జియాతో తలపడనున్నాడు. ఎంతో ఉత్కంఠగా జరిగిన ఈ పోరులో తొలి గేమ్ ఆరంభంలోనే వెనుకబడినట్లు కనిపించిన లక్ష్యసేన్, ఆ తర్వాత వేగం పుంజుకున్నాడు. ఒకానొక దశలో 15-11తో ఆధిక్యంలో నిలిచాడు. అయితే అక్సెల్సెన్ క్రమంగా తన జోరును పెంచాడు. దీంతో లక్ష్యసేన్ మూడు గేమ్ పాయింట్‌లను వృథా చేసుకున్నాడు. మరోవైపు అక్సెల్సెన్ వరుసగా ఐదు పాయింట్లు సాధించి ఈ గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో సెట్‌లో లక్ష్యసేన్ 7-0తో భారీ ఆధిక్యాన్ని కనబరిచినప్పటికీ ఆ తర్వాత ప్రత్యర్థి గేమ్ చూసి తేలిపోయాడు. ఇక డెన్మార్క్ షట్లర్ కూడా జోరు పెంచి వరుసగా పాయింట్లు సొంతం చేసుకున్నాడు. గట్టిగా పోటీనిచ్చి గేమ్‌తో పాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు.

వక్ఫ్‌పై కేంద్రం పంజా

(మొదటిపేజీ తరువాయి)

లేక ఆస్తిని నియంత్రించేందుకు వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. యూపీఏ-2 హయాంలో వక్ఫ్ చట్టం కింద అదనపు అధికారాలను కల్పించారు. కానీ ప్రస్తుత మోదీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు నిర్వీర్యానికి కసరత్తు చేస్తోంది. ఆస్తుల దుర్వినియోగాన్ని నివారించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న 30 వక్ఫ్‌బోర్డుల పరిధిలో 8.7లక్షల ఆస్తులున్నాయి. సైన్యం, రైల్వే తర్వాత మూడవ అతిపెద్ద భూ యజమాని (సుమారు 9.4 లక్షల ఎకరాలు)గా వక్ఫ్ బోర్డు ఉన్నది. తాజాగా వక్ఫ్ చట్టాన్ని ప్రతిపాదించే సవరణలు... పాలనా సంస్కరణలకు, మత స్వయంప్రతిపత్తికి మధ్య వివాదానికి పార్లమెంటు సాక్షిగా అజ్యం పోసే పని చేయనున్నాయి.

సవరణలు అక్కర్లేదు: ముస్లిం లా బోర్డు

వక్ఫ్ చట్టానికి ఎటువంటి సవరణల అవసరం లేదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) సభ్యుడు మౌలానా ఖాలిద్ రషీద్ ఫరంగీ మహాలీ తేల్చిచెప్పారు. 'మా పూర్వీకులు తమ ఆస్తుల్లో పెద్ద భాగాన్ని దానం చేశారు. ఇస్లామిక్ చట్టం ప్రకారం వక్ఫ్ ఏర్పాటైంది. వక్ఫ్‌బోర్డు విషయానికొస్తే ఆ ఆస్తులను స్వచ్ఛంద సేవలకే వినియోగించాలి. వక్ఫ్ చేసేది అదే. ఒక ఆస్తిని 'వక్ఫ్' చేసిన తర్వాత దానిని అమ్మడం లేక బదిలీ చేయడానికి చట్ట ప్రకారం వీలుండదు. ఆస్తుల నిర్వహణకు 1995లో చేసిన వక్ఫ్ చట్టం ఉన్నది. 2013లో దీనికి కొన్ని సవరణలు జరిగాయి. మరిన్ని సవరణల అవసరం లేదు. ఒక వేళ సవరణలు చేయడం అవసరమని కేంద్రం భావిస్తేగనుక ముందుగా వీటిపై సంప్రదింపులు జరపాలి... భాగస్వాముల అభిప్రాయాలు తీసుకోవాలి. వక్ఫ్ ఆస్తుల్లో 60-70శాతం మసీదులు, దర్గాలు, శ్మశానాలు ఉంటాన్ని ప్రతి ఒక్కరు గమనంలో ఉంచుకోవాలి' అని మౌలానా ఖాలిద్ వెల్లడించారు.

వక్ఫ్‌బోర్డు స్వయంప్రతిపత్తిని హరించేందుకే: ఒవైసీ

వక్ఫ్‌బోర్డు స్వయంప్రతిపత్తిని హరించి, దానిని తమ పరిధిలోకి తెచ్చుకోవాలన్న మోదీ ప్రభుత్వ కుయుక్తులకు ప్రతిపాదిత చట్ట సవరణలు అద్దం పట్టాయని ఏఐఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. హిందూత్వ అజెండాగల బీజేపీ ముందు నుంచే వక్ఫ్‌కు వ్యతిరేకమని, వక్ఫ్ ఆస్తులపై అధికారాన్ని కోరుకుంటోందని, ఈ చర్య మత స్వేచ్ఛకు విరుద్ధమని దుయ్యబట్టారు. పార్లమెంటు వేళ... చట్టసభల కంటే ముందు మీడియాకు సమాచారం ఇవ్వడం ద్వారా పార్లమెంటరీ ఆధిపత్యం, అధికారాలకు విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందని ఒవైసీ వ్యాఖ్యానించారు.

సాగర్‌కు వరద పోటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుతం జలాశయంలో 200.19 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ గేట్లను ఎత్తివేసి దిగువకు నీళ్లు వదులుతున్నారు.

గరిష్ఠ నీటి మట్టానికి చేరువలో సాగర్

నాగార్జునసాగర్‌కు జలాశయానికి వరద నీరు పరవళ్లు తొక్కడంతో గరిష్ఠ నీటి మట్టం చేరువ దశలో ఉంది. ఆదివారం సాయంత్రానికి సాగర్ ఇన్‌ఫ్లో 4.34లక్షలు, అవుట్ ఫ్లో 37వేల క్యూసెక్కులు ఉందని అధికారులు వెల్లడించారు. సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు ఉండగా, ప్రసుతతం 575 అడుగులకు చేరింది. సాగర్ పూర్తి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 269 టీఎంసీలకు నీటి ప్రవాహంతో నిండిపోతోంది. సాగర్‌కు భారీగా వరద నీరు చేరడంతో సోమవారం ఉదయం నాగార్జునసాగర్ క్రస్ట్ గేట్లు తెరుచుకోనున్నాయి. కృష్ణాపరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది. సాగర్ దిగువ ప్రాంతాలను తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అప్రమత్తం చేశాయి. సాగర్ నీటి విడుదలతో ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. అటు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ, సూర్యారావుపేట ప్రాంతాల ప్రజలకూ హెచ్చరికలు జారీజేశారు. అటు సాగర్ నుంచి నదికి నీటి విడుదల మొదలైతే, పులిచింతల ప్రాజెక్టుకు నీరు చేరుతుంది. దానివల్ల పులిచింతలలో 45 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉంది. సాగర్ జలాశయం నిండటం వల్ల ఈ ఏడాది సాగునీటికి భరోసా కలుగుతుందని రైతులు భావిస్తున్నారు.

శ్రీశైలం, సాగర్‌కు సందర్శకుల తాకిడి

నంద్యాల జిల్లా శ్రీశైలం డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో సందర్శకుల తాకిడి భారీగా పెరిగింది. ఆదివారం కావడంతో శ్రీశైలం జలాశయాన్ని తిలకించేందుకు గాను పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. దీంతో శ్రీశైలం ఘాట్ రోడ్డులో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పర్యాటకుల తాకిడితో శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనం కోసం రావడంతో భక్తులు దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాలసి వచ్చింది. అటు నాగార్జున సాగర్‌ను తిలకించేందుకు పెద్దఎత్తున సందర్శకులు వస్తున్నారు. దీంతో సాగర్ వద్ద ప్రజలతో హడావుడి నెలకొంది.

ప్రణాళికాబద్ధంగా అమరావతి

(మొదటిపేజీ తరువాయి)

రెండు రోజులపాటు అమరావతిలో పర్యటించింది. 2019కు ముందు నిర్మాణాలు ప్రారంభమై మధ్యలోనే నిలిచిపోయిన భవనాలు, మరికొన్ని ఫౌండేషన్ పనులు పూర్తి చేసుకుని అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఐఐటీ ఇంజినీర్లతో రాష్ట్ర ప్రభుత్వం అధ్యయనం చేయించింది. ఆయా నిర్మాణాల పటిష్టత, సాంకేతిక అంశాలను ఐఐటీ ఇంజినీర్లు పరిశీలించారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం తన పాలనా కాలంలో సచివాలయం, ప్రధాన శాఖాధిపతులు (హెచ్ఓడీ) కార్యాలయాల టవర్లతో పాటు హైకోర్టు భవనాన్ని ఐకానిక్ కట్టడాలుగా నిర్మించేలా పనులు ప్రారంభించింది. దీనికోసం భారీగా పునాదులు కూడా వేసింది. అయితే పునాదుల దశలోనే ఆయా నిర్మాణాలు నిలిచిపోయాయి. ఈ భవనాల ఫౌండేషన్ సామర్థ్యాన్ని పరిశీలించే బాధ్యతను ఐఐటీ-మద్రాస్‌కు కూటమి ప్రభుత్వం అప్పగించింది. ఐఏఎస్ అధికారుల నివాసాలు, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్ల నాణ్యతను అంచనా వేసే బాధ్యతను హైదరాబాద్ ఐఐటీకి కేటాయించింది. ఏపీ సీఆర్డీఏ అధికారులతో కలిసి ఐఐటీ ఇంజినీర్ల బృందం రెండు రోజుల పాటు పర్యటించింది. ఐకానిక్ టవర్ల వద్ద రాఫ్ట్ ఫౌండేషన్‌ను నిపుణులు పరిశీలించారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందితో కలిసి నీటిలో మునిగిన నిర్మాణాలను తిలకించారు. ఐఐటీ ఇంజినీర్ల బృందం నివేదిక సిద్ధం చేసి సీఆర్డీఏకు ఇవ్వనుంది.

ఐదేళ్లుగా నీటిలోనే రాఫ్ట్ ఫౌండేషన్ ప్రాంతం

ఐదేళ్లుగా అమరావతిలోని నిర్మాణాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఉండిపోయాయి. రాఫ్ట్ ఫౌండేషన్ వేసిన ప్రాంతం గడిచిన ఐదేళ్లుగా పూర్తిగా నీటిలో మునిగి ఉన్నట్లుగా నిపుణులు గుర్తించారు. చాలా కట్టడాలు ప్రారంభంలోను, మధ్య దశలోనే నిలిచిపోయాయి. సచివాలయం, హెచ్ఓడీ భవనాలు, హైకోర్టు, అసెంబ్లీ నిర్మాణాలకు సంబంధించిన ఫౌండేషన్ బేస్‌మెంట్లను ఇంజినీర్ల బృందం పరిశీలించింది. ఐఐటీ మద్రాస్‌లోని స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ మెహర్ ప్రసాద్, కొరోజన్ విభాగంలో నిపుణుడు ప్రొఫెసర్ రాధాకృష్ణ పిళ్లై, ఫౌండేషన్, మెటీరియల్ ఇంజనీరింగ్ విభాగం నిపుణుడు ప్రొఫెసర్ సుభాదీప్ బెనర్జీ అమరావతిలోని ఈ భవనాలకు సంబంధించిన రాఫ్ట్ ఫౌండేషన్‌ను తిలకించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఏర్పాటు చేసిన బోట్లలో నీట మునిగిన సచివాలయం, హెచ్ఓడీ ఐకానిక్ టవర్లకు చెందిన పిల్లర్లు, రాఫ్ట్ ఫౌండేషన్ ప్రాంతానికి వెళ్లారు. రాఫ్ట్ ఫౌండేషన్ ప్రాంతంలో దాదాపు అర టీఎంసీకి పైగా నీరు నిల్వ ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రస్తుతం నీటిలో మునిగిపోయి ఉన్న రాఫ్ట్ ఫౌండేషన్, బేస్‌మెంట్ల వద్ద నిర్మాణాల్లో వినియోగించిన ఇనుము పూర్తిగా తుప్పుపట్టిందని, వాటి పటిష్టతపై సాంకేతికంగా పరీక్షలు నిర్వహించాల్సి ఉందని నిపుణులు భావిస్తున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో భూ సామర్థ్య పరీక్షలు నిర్వహించాల్సి ఉందని ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు తెలిసింది.

ఐకానిక్ టవర్లు దాదాపు 40 నుంచి 46 అంతస్తులుగా నిర్మించాలని ప్రణాళిక చేసినందున ఆ మేరకు ఎంత భారాన్ని ప్రస్తుతం ఉన్న ప్రాంతం మోయగలుగుతుందన్న దానిపై పరీక్షలు చేయాల్సి ఉందని సమాచారం. ఈ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో అధ్యయనం తర్వాత నిపుణుల బృందం సీఆర్డీఏకు నివేదిక ఇవ్వనుంది. దాని ఆధారంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించనుంది.

100 రోజుల కార్యాచరణ

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. కలెక్టర్ల సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను శాఖల వారీగా సమీక్షిస్తారు. ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం వివిధ అంశాలపై సీఎం సమీక్షించి అధికారులకు సూచనలిస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లతోపాటు ఆయా శాఖాధిపతులు సమావేశానికి హాజరవుతారు.

అన్నమయ్యజిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దహనం సంఘటనతో ప్రభుత్వం ఒక్కసారిగా ఈ భూ కబ్జాల వ్యవహారంపై దృష్టి సారించింది. దాంతోపాటు రాష్ట్ర నలుమూలలా ఎక్కడెక్కడ భూ కబ్జాలు జరిగాయి, వాటి వివరాలను అధికారికంగా సేకరించనుంది.

వాణిజ్య రాజధానికి ట్రాఫికర్!

(మొదటిపేజీ తరువాయి)

అతిభారీ వాహనాలు సుమారు 2,500 వరకు రిపేర్ల నిమిత్తం వచ్చి పోతుంటాయి. దీనికితోడు ప్రసిద్ధ బస్ భవన్‌గా పేరుగాంచిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు రోజూ సుమారు 3,000 వేల బస్సులు రాష్ట్రంలోని వివిధ పట్టణాలు, నగరాల నుంచి ప్రయాణికులతో విజయవాడ వచ్చిపోతుంటాయి. సుమారు 500కి పైగా సిటీ బస్సులు నగరంలో తిరుగాడుతూ ఉంటాయి. వీటికి తోడు వందలాది ప్రైవేట్ బస్సులు నగరంలోకి ప్రవేశించడం, బస్‌స్టాండ్, నగరంలోని వివిధ ప్రాంతాల్లో రహదారులపై గంటలతరబడి నిలిపి ఉంచడం, నగరం గుండా ప్రయాణించడంతో రహదారులు బస్సుల రాకపోకలతో కిక్కిరిసిపోతుంటాయి. దీంతో ప్రయాణించాలంటేనే వాహనదారులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. మరీ ముఖ్యంగా బెంజిసర్కిల్, ఆటోనగర్ గేట్, కంట్రోల్ రూం, పీడబ్ల్యూడీ గ్రౌండ్, రామవరప్పాడు రింగ్ రోడ్డు, సితార తదితర ముఖ్యమైన కూడళ్లలో సిగ్నల్ పడితే చాలు కాలుమోపడానికి కూడా వీలులేకుండా పోతోంది. విజయవాడ నగరంలో ట్రాఫిక్ తగ్గించాలన్న ఉద్దేశంతో కనకదుర్గ ఫ్లైఓవర్, బెంజిసర్కిల్ ఫ్లైఓవర్‌ల నిర్మాణం జరిగినా వేలాదిగా వాహనాలు ప్రయాణం సాగిస్తుండడంతో ట్రాఫిక్ నానాటికీ పెరిగిపోతోంది. 16వ నంబరు, 65వ నంబరు జాతీయ రహదారులు నగరం నడిబొడ్డున ఉండడంతో 24 గంటలూ వాహనాల రద్దీ అధికంగానే ఉంటుంది. మూడు జాతీయ రహదారులు, నాలుగు రాష్ట్ర హైవేల్లో ప్రతిరోజూ నాలుగు వేలకు పైగా లారీలు నగరం మీదుగా ప్రయాణిస్తాయని గణాంకాల ద్వారా తెలుస్తోంది. ఇదంతా ఓ ఎత్తయితే... దక్షిణ భారత దేశంలోనే అతి పెద్దదయిన విజయవాడ రైల్వే స్టేషన్ నుంచి వేలాదిగా ప్రయాణికులు నగరానికి వచ్చిపోతుండడం, వివిధ వాహనాల్లో ఇరుకైన రోడ్లపై ప్రయాణిస్తుండడంతో ట్రాఫిక్ నిర్వహణ సవాలుగా మారుతోంది. నగర వ్యాప్తంగా 121 ట్రాఫిక్ బీట్‌లు, 20కి పైగా సిగ్నల్స్ వద్ద సుమారు 500 మంది ట్రాఫిక్ పోలీసులు షిఫ్టుల వారీ విధులు నిర్వహిస్తున్నా వాహనాలను నియంత్రించడం కష్టతరంగా మారుతోంది. విజయవాడ నగరంపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించాలని దశాబ్దం కాలం క్రితం గొల్లపూడి నుంచి రామవరప్పాడు వరకు సుమారు 10 కిలోమీటర్లు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం జరిగినా వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్‌ను నియంత్రించడం కష్టతరంగా మారింది. పెదఅవుటపల్లి నుంచి గొల్లపూడి మీదుగా మంగళగిరి సమీపంలోని చినకాకాని వరకు సుమారు 38 కిలోమీటర్లు నిర్మిస్తున్న అవుటర్ రింగ్ రోడ్డు పూర్తయితేగానీ విజయవాడ నగరం మధ్యలోంచి వెళ్లే జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలకు ఫుల్‌స్టాప్ పడుతుంది. దీంతో ట్రాఫిక్ కష్టాలు తీరే అవకాశం ఉంటుంది. గొల్లపూడి-చినకాకానిని అనుసంధానం చేస్తూ కృష్ణా నదిపై నిర్మించే బ్రిడ్జి తుది దశకు చేరుకుంది. ఇదేగనుక మనుగడలోకి వస్తే హైదరాబాద్ నుంచి వైజాగ్... చెన్నై వెళ్లే వాహనాలు నగరంలోకి వచ్చే అవకాశం ఉండదు. అప్పటి వరకు బెజవాడకు ట్రాఫిక్ బాధలు తప్పవు.

గిరిరాజ్‌కు నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

రోడ్డు వద్ద బాలికల పాఠశాల సమీపంలో పార్కు శంకుస్థాపనకు వచ్చారు. కాగా, తమ సమస్యల పరిష్కరించాలని ఏఎస్ఎం కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. గిరిరాజ్ కాన్వాయ్‌ను అడ్డుకుని వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించారు. అయితే కారు నుంచి దిగిన ఆయన ఒకరి బైక్ వెనుక కూర్చొన్నారు. నిరసనకారులను తప్పించుకుని బైక్‌పై అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరోవైపు నిరసన చేస్తున్న ఏఎస్ఎం కార్యకర్తలు ఇది చూసి షాక్ అయ్యారు. వారంతా పరుగున స్కూల్ వద్దకు వెళ్లారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకుని వారిని చెదరగొట్టారు. అయితే కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ బైక్‌పై జారుకున్న వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

ఎస్సీ వర్గీకరణను అంగీకరించం

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలు ఒక సమూహంగానే ఎదుర్కొన్నారని, ఈ వర్గమంతా సమానంగా ఉన్నందున ఉప వర్గీకరణ చేయడం సరికాదని మాయావతి అభిప్రాయపడ్డారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణపై సుప్రీంకోర్టు గురువారం చారిత్రక తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే. విద్యా సంస్థల్లో ప్రవేశాలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్లను ఉపవర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశంపై 2004లో ఐదుగురు సభ్యులు ఇచ్చిన తీర్పును పక్కనబెట్టిన విస్తృత ధర్మాసనం.. గురువారం 6:1 మెజారిటీతో సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఈ చారిత్రక తీర్పును ఇచ్చింది.

పాఠశాలల్లో స్మార్ట్‌ఫోన్లపై నిషేధం

న్యూఢిల్లీ: ఇది సాంకేతిక యుగం. అంతా డిజిటల్‌గా మారిపోతున్న తరుణం. ఇలాంటప్పుడు టెక్నాలజీ వినియోగాన్ని పరిమితం చేయాలనడం చర్చనీయాంశమే! కోవిడ్-19 అనంతర పరిస్థితుల దృష్ట్యా విద్యాసంస్థల్లో డిజిటల్ లెర్నింగ్‌కు ఆదరణ పెరిగింది. తరగతి గదుల్లో పుస్తకాలకు బదులు కంప్యూటర్ స్క్రీన్లు దర్శనమిస్తున్నాయి. పెన్నుకు బదులు పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, స్మార్ట్‌ఫోన్లు ఉంటున్నాయి. అయితే స్మార్ట్‌ఫోన్ల మితిమీరిన వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావాన్ని ఐక్య రాజ్యసమితి గుర్తించింది. ఇదే కారణంగా ప్రతి నాలుగులో నుంచి కనీసం ఒక దేశంలోని స్కూళ్లలో స్మార్ట్‌ఫోన్లు వినియోగించకుండా విద్యార్థులకు ఆంక్షలు ఉన్నట్లు అంతర్జాతీయ విద్య పర్యవేక్షణ (జీఈఎం) నివేదిక తెలిపింది. టెక్నాలజీని అతిగా వినియోగిస్తే విద్యార్థుల ప్రదర్శన దెబ్బతింటున్నట్లు పేర్కొంది. 'విద్యలో సాంకేతికత' శీర్షికతతో ఐరాస విద్య, శాస్త్రీయ, సాంస్కృతిక సంఘం (యునెస్కో) ఈ నివేదికను ప్రచురించింది. మొబైల్‌కు చేరువయ్యే విద్యార్థుల దృష్టి చదవుపై నుంచి మళ్లుతోందని, వారి అభ్యాసన శక్తి దెబ్బతింటోందని వెల్లడించింది.

వెయ్యేళ్ల జైన శిల్పాన్ని కాపాడుకోవాలి: ఈమని

విశాలాంధ్ర-కర్నూలు: జిల్లా కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలోని కల్లూరు మండలం నాయకల్లు గ్రామ శివారులో నిర్లక్ష్యంగా పడి ఉన్న వెయ్యేళ్ల నాటి వర్ధమాన మహావీరుని శిల్పాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ ఈమని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మారుమూల పల్లెల్లో అస్తవ్యస్తంగా పడి ఉన్న శిల్పాలు, శాసనాలు, శిథిలాలపై స్థానికులకు అవగాహన కల్పించే 'ప్రిజర్వ్ హెరిటేజ్ ఫర్ పోస్టేరిటి' కార్యక్రమంలో భాగంగా ప్లీచ్ ఇండియా బృందం నాయకల్లు గ్రామంలో ఆదివారం పర్యటించింది. నిర్లక్ష్యంగా పడి ఉన్న శిల్పాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామానికి ఉత్తరంగా రోడ్డు పక్క పొదల్లో 24వ జైన తీర్థంకుడైన వర్ధమాన మహావీరుడి శిల్పం, ఒక స్తంభం, పీఠాలను గ్రామానికి తరలించి, భద్రపరిచి, చారిత్రక వివరాలతో ఒక పేరు పలకను ఏర్పాటు చేయాలని శివనాగిరెడ్డి గ్రామస్థులకు సూచించారు. ఇవి క్రీస్తుశకం 10వ శతాబ్దం నాటి రాష్ట్రకూటులకు చెందినవని చెప్పారు. రాష్ట్ర పురావస్తు శాఖ అధికారి, మహేంద్ర నాయుడు, ప్లీచ్ ఇండియాకు చెందిన జితేంద్ర, చరణ్, శ్రీహరి, హరీష్, ఉదయ్ కిరణ్, దుర్గ, మైత్రేయి, కౌస్తుభ్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చాలనే

బీజేపీ కుట్రలు అడ్డుకున్నాం: ముప్పాళ్ల

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: దేశంలో అధికారం చేపట్టిన బీజేపీ మతోన్మాద, నియంతృత్వ పోకడలతో పాలన చేస్తోందని, గత సార్వత్రిక ఎన్నికల్లో మెజార్టీ సాధించి రాజ్యాంగాన్ని మార్చాలనుకున్న బీజేపీ కుట్రలను ఇండియా ఐక్య సంఘటనతో కలిసి అడ్డుకోవడంలో కమ్యూనిస్టు పార్టీగా సఫలీకృతులయ్యామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఏలూరులోని స్ఫూర్తి భవన్‌లో సీపీఐ ఏలూరు జిల్లా సర్వసభ్య సమావేశం పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జ్ అక్కినేని వనజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ కామ్రేడ్ అంటేనే ప్రజలకు అత్యంత ఆప్తుడని, కమ్యూనిస్టు పార్టీ ప్రజలతో మమేకమై అనేక ఒడిదుడుకులు అధిగమించి ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపుతుందన్నారు. అటువంటి సీపీఐని పునాదుల నుంచి నిర్మాణాత్మకంగా చేసేందుకు సార్వత్రిక ఎన్నికల అనంతరం దేశంలో, రాష్ట్రంలో అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో సీపీఐ రాష్ట్ర స్థాయి నేతలు పర్యటిస్తూ ఆయా నిర్ణయాలను జిల్లా నేతలతో అమలు చేయించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. పార్టీ అనుబంధ విభాగాలు క్షేత్రస్థాయిలో బలపడినప్పుడే కమ్యూనిస్టు భావజాలం ప్రజల్లోకి చొచ్చుకుపోతుందని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ ఏడాది డిసెంబరు 25వ తేదీకి 100వ సంవత్సరంలో అడుగుపెడుతున్న తరుణంలో ఏడాది పాటు కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు ముప్పాళ్ల తెలిపారు. ఇందుకోసం ఆగస్టు నుంచి జిల్లా స్థాయి మొదలుకొని గ్రామీణ స్థాయి వరకు అన్ని విభాగాలు విరివిగా సమావేశాలు నిర్వహించి సభ్యులను సమాయత్తం చేయడంతో పాటు కార్యక్రమాల నిర్వహణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేస్తూ సామాన్య ప్రజలపై ఆర్థిక భారాలు మోపిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు.

అక్కినేని వనజ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో అనేక నిర్మాణాత్మకమైన నిర్ణయాలు తీసుకొని కమ్యూనిస్టు పార్టీ పటిష్టతకు జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలంతా ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. ఇందుకు జిల్లా, గ్రామీణ స్థాయి నాయకులు, సభ్యులు మరింత సహకారం అందించి సీపీఐ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద విధానాలపై పార్టీ జాతీయ స్థాయిలో స్పష్టమైన అవగాహనతో ఉందని, వాటిని ప్రజలకు వివరించి బీజేపీ చేస్తున్న అరాచకాలను అడ్డుకునేందుకు పార్టీ నాయకులంతా పిడికిలి బిగించాలని పిలుపునిచ్చారు. కేరళ రాష్ట్రం వయనాడ్ దుర్ఘటనపై ప్రపంచమంతా మానవతా దృక్పథంతో స్పందిస్తుంటే కేవలం రాజకీయ స్వలాభం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేరళ కమ్యూనిస్టు ప్రభుత్వంపై బురదజల్లే రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ మాట్లాడుతూ కమ్యూనిస్టు భావజాలం ప్రజల్లోకి బలంగా వెళ్లాలంటే నిర్మాణాత్మకమైన నిర్ణయాలు పై నుంచి క్రింది స్థాయి వరకు పటిష్టంగా అమలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాట ఫలితంగానే దేశంలో లక్షలాది మంది పేదలకు భూములు దక్కాయని, దళితులకు సైతం ప్రభుత్వాలు గృహాలు నిర్మించి ఇస్తున్నాయని, సంక్షేమ పథకాలూ అమలవుతున్నాయని అన్నారు. ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి పార్టీ సభ్యులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ నెలలో సీపీఐ అనుబంధ శాఖలన్నీ తప్పనిసరిగా ఆయా ప్రాంతాల్లో విధిగా సమావేశాలు నిర్వహించి గ్రామ స్థాయిలో ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ మాట్లాడుతూ సీపీఐ అనుబంధం విభాగాలు క్షేత్రస్థాయిలో బలమైన పునాదులు వంటివని, వాటి పటిష్టానికి అందరూ కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రామారావు, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని, సీపీఐ అనుబంధ శాఖల జిల్లా, మండల స్థాయి నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

యుద్ధాల నివారణకు ఐరాస తోడ్పడాలి

ఇస్కఫ్ నాయకులు రాజశేఖర్

విశాలాంధ్ర-విజయవాడ: పలస్తీనా-ఇజ్రాయిల్, రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య సాగుతున్న యుద్ధాలను నివారించేందుకు ఐక్యరాజ్య సమితి కృషి చేయాలని, అమెరికా జోక్యం నివారించాలని భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం, హిరోషిమా డే పురస్కరించుకుని ఇస్కఫ్, శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో స్థానిక దాసరి నాగభూషణరావు భవన్‌లో ఆదివారం శాంతి సభ నిర్వహించారు. యావత్తు ప్రపంచ సంపదను తన గుప్పెట్లో ఉంచుకునేందుకు అమెరికా వంటి సామ్రాజ్యవాద దేశాలు ఆధిపత్యం చెలాయిస్తూ యుద్ధాలకు కాలు దువ్వుతున్నాయని విమర్శించారు. ప్రపంచ దేశాల మధ్య ఐక్యత, శాంతి కోసం శాంతి స్నేహ సంఘాలు, సోషలిస్టు దేశాలు విశేష కృషి చేస్తున్నాయని తెలిపారు. సోషలిస్టు దేశం వియత్నాంలో పర్యటించి వచ్చిన రాజశేఖర్, నిర్మల ఆ దేశ పరిస్థితులు, అక్కడి అభివృద్ధి గురించి వివరించారు. జిల్లా కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు అధ్యక్షత వహించగా శాంతి సంఘం రాష్ట్ర అయిప్సో కన్వీనర్ మహంకాళి సుబ్బారావు, రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య, మోతుకూరి అరుణకుమార్, మహబూబ్ అజం మాట్లాడుతూ కేరళ వరదల్లో వందలాది మంది మృత్యువాత పడగా వేలాది మంది నిరాశ్రయులు అయ్యారని వారికి అండగా ఉండటం మన అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు గోలి సీతారామయ్య, సుబ్బారాయుడు, వెలగపూడి ఆజాద్, మోతుకూరి వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు ఆర్.రవీంద్రనాథ్, లంక దుర్గారావు, పంచదార్ల దుర్గాంబ, డి.సూరిబాబు, విద్యార్థి సమాఖ్య నాయకులు జాన్సన్ బాబు, ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కౌలు రైతుల చట్టం

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం ఒక సమగ్ర కౌలు రైతుల చట్టాన్ని తీసుకురావాలని, తద్వారా కౌలు రైతులకు అండగా కూటమి ప్రభుత్వం నిలవాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.కాటమయ్య, పి.జమలయ్య ఆదివారం లేఖ రాశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం నూతనంగా తీసుకు వస్తున్న కౌలు రైతుల చట్టంలో కీలకమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని, తద్వారా సమగ్రమైన కౌలు చట్టాన్ని తీసుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సాగుదారులల్లో 70 శాతం కౌలు రైతులేనని, సాగువుతున్న భూమిలో 80 శాతం పంటలు పండిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ఆంధ్ర ప్రదేశ్ పంట సాగుదారు హక్కుల చట్టంలో భూ యజమాని గుర్తింపు కార్డుపై సంతకం పెడితేనే కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలని నిబంధనలు ఉన్నాయని తెలిపారు. గుర్తింపు కార్డులపై సంతకం పెట్టేందుకు ఎక్కువ మంది భూ యజమానులు ముందుకు రావడం లేదన్నారు. ఆర్‌బీఐ నిబంధన ప్రకారం ఎలాంటి హామీ లేకుండానే లక్షా 60 వేల రూపాయల వరకు పంట రుణాలు ఇవ్వాలని ఉన్నప్పటికీ, ఏ బ్యాంకు అమలు చేయడం లేదన్నారు. ప్రకృతి విపత్తులు, చీడపీడలు సంభవించినప్పుడు ఇన్‌పుట్ సబ్సిడీలు, పంటల బీమా పరిహారాలు కౌలు రైతులకు చెల్లించడం లేదని, అవన్నీ భూ యజమానులకే వెళుతున్నాయని తెలిపారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో కౌలు రైతులకు తీరని నష్టం వాటిల్లిందని గుర్తుచేశారు. గ్రామ సభల్లోనే నేరుగా కౌలు రైతులను గుర్తించి భూయజమాని సంతకంతో సంబంధం లేకుండానే గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. దేవాదాయ, ధర్మా దాయ, వివిధ ట్రస్టుల భూములను, వక్ఫ్ భూములను సాగు చేసుకుంటున్న కౌలు రైతులకు కౌలు అగ్రిమెంట్ ప్రకారం గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. గుర్తింపు కార్డులు పొందిన భూమి లేని ప్రతి కౌలు రైతుకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేసి రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. ప్రాథ మిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో కౌలు రైతులకు సభ్యత్వం ఇచ్చి పంట రుణాలు ఇవ్వాలని, ఈ-పంట నమోదులో గుర్తింపు కార్డు లేకపోయి నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిశీలించి సాగులో ఉన్నవారి పంటలను నమోదు చేయాల న్నారు. దుర దృష్టవశాత్తు ఆత్మహత్యలకు పాల్పడిన కౌలు రైతుల కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఎక్స్‌గ్రేషి యాను సులభంగా అందించాలని కోరారు. మూడు నెలలకు ఒకసారి వ్యవసాయ, ఉద్యాన, పట్టు, మార్కెట్, రెవెన్యూ, బ్యాంకు అధికారులతోను, కౌలు రైతుల ప్రతినిధులతోను సమావేశాలు నిర్వహించాలన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం చేస్తే ప్రతిఘటన: ఓబులేసు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం (విశాఖ): విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తే ప్రతిఘటన తప్పదని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే దీక్షలు ఆదివారం 1,270 వ రోజుకు చేరుకున్నాయి. ఓబులేసు దీక్షా శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఉక్కు కర్మాగారాన్ని కేంద్రం కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను విరమించుకోవాలని అన్నారు. ఎన్నో పోరాటాలు, ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన ఈ కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. సంవత్సరాలుగా ఉద్యోగులు దీక్షలు చేపట్టినప్పటికీ కేంద్రంలో చలనం లేక పోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే తన ప్రయత్నాన్ని విరమించుకోవాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. దీక్షల్లో ఉక్కు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సంఘం జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు మన్మథరావు, జి.ఎస్.జె.అచ్యుత రావు, నాయకులు కొండలరావు , కసిరెడ్డి సత్యనారాయణ, రెహమాన్, ఉక్కు ఏఐటీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మసిన్ రావు, అదనపు ప్రధాన కార్యదర్శి జె. రామకృష్ణ, కోశాధికారి కె.రాజబాబు, డొక్కా నర్సింగరావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు మంత్రి రవి, మంగరాజు, నాగరాజు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' సత్వరం అమలు చేయాలి: జంగాల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: సూపర్ సిక్స్ హామీల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం సత్వరమే ఆ హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గుంటూరు నగర సమితి అధ్వర్యంలో ఆదివారం అశోక్‌నగర్ శాఖ సమావేశం పెద్ది శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. తొలుత కేరళలోని వయనాడ్ ప్రాంతంలో భారీ వర్షాలు, వరదలకు మరణించిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల మాట్లాడుతూ వయనాడ్ బాధితులకు బియ్యంతో పాటు వస్తు రూపంలో సహాయం చేసి మానవత్వం చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కమిటీ సభ్యులు మేడా హనుమంతరావు, సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వర్లు, నగర కమిటీ ఆకిటి అరుణ్ కుమార్, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

'నకిలీ నోట్లు' ముఠా గుట్టురట్టు

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు:

నకిలీ నోట్లు మార్పిడి చేసే ఒక ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఎంతో చాకచక్యంగా వీరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.47 లక్షల విలువ కలిగిన రూ.500 నకిలీ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వివరాలు వెల్లడించారు. ఏలూరుకు చెందిన దొండపాటి ఫణి కుమార్ 108 అంబులెన్స్‌లో నాలుగేళ్లుగా టెక్నీషియన్ గా పనిచేస్తున్నాడు. ఈ ఏడాది జులై 28న 84669 50693 నెంబర్ నుంచి ఒక అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. అసలు నోట్లు రూ.పది లక్షలు ఇస్తే... రూ.44 లక్షల విలువైన నకిలీ రూ.500 నోట్లు ఇస్తామని ఫణి కుమార్ కు ఆశ చూపాడు. తన వద్ద అంత సొమ్ము లేదని ఫణి కుమార్ చెప్పాడు. ఎంతో కొంత అడ్వాన్స్ ఇవ్వాలని అపరిచిత వ్యక్తి ఫణి కుమార్‌ను కోరాడు. జూలై 30న ఫోన్ చేసిన వ్యక్తికి ఫణి కుమార్ రూ.మూడు లక్షలు అసలు నోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చాడు. మిగిలిన సొమ్ము కూడా చెల్లిస్తే రూ.44 లక్షల నకిలీ 500 నోట్లు ఇస్తామని ఫణి కుమార్‌కు ఫోన్‌లో ఆ వ్యక్తి చెప్పాడు. ఈ విషయాన్ని ఫణి కుమార్ తన స్నేహితులకు చెప్పాడు. వీరంతా కలిసి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సూచనల మేరకు ఫణికుమార్ అవతల వ్యక్తికి ఈ నెల 3వ తేదీన ఫోన్ చేశాడు. మిగిలిన సొమ్ము తీసుకువస్తున్నానని మీరు కూడా రూ.44 లక్షల నకిలీ రూ.500 నోట్ల కట్టలు తీసుకురావాలంటూ సమాచారం ఇచ్చాడు. చింతలపూడి మండలం మల్లాయిగూడెం గ్రామానికి చెందిన మారుమూడి మధుసూదన్ రావు, బీరెల్లి రాంబాబు (కారు డ్రైవర్), శ్రీనివాసరెడ్డి స్థానిక కొత్త బస్టాండ్ వెనకాల రైల్వే ట్రాక్ దగ్గరకు నకిలీ 500 నోట్ల కట్టలను కారులో తీసుకువచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన పోలీసులు మధుసూదన్ రావు, బీరెల్లి రాంబాబులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నకిలీ 500 రూపాయలు 94 నోట్ల కట్టలను, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో వ్యక్తి శ్రీనివాస్ రెడ్డి ఘటన స్థలం నుంచి పరారవ్వగా అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. మురళీకృష్ణ, ఏలూరు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కాగిత శ్రీనివాస రావు, పోలీసులను ఎస్పీ అభినందించారు. జిల్లా అదనపు ఎస్పీ జి.స్వరూప రాణి పాల్గొన్నారు.

దేవదాయశాఖలో మరో కుంభకోణం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేవదాయశాఖలో మరో కుంభకోణం వెలుగు చూసింది. తాజాగా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వినోద్ కుమార్‌పై ఏసీబీ కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఓ మహిళా అసిస్టెంట్ కమిషనర్‌పైనా అనేక ఆరోపణలు రావడంతో కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలు తీసుకుంది. ఆ సంఘటన మర్చిపోకముందే వినోద్‌కుమార్‌పై ఏసీబీ కేసు నమోదు చేసింది. విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఆయన భారీ భూ కుంభకోణాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. దేవదాయశాఖ భూములకు నిబంధనలకు విరుద్ధంగా ఎన్వోసీలు జారీజేసినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. ఎన్టీఆర్‌జిల్లా జగ్గయ్యపేట శ్రీఓంకారేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన నాగ పడగల ప్రతిష్ఠలో ఆయన అవినీతికి పాల్పడినట్లు సమాచారం. దాదాపు రూ.68 లక్షల మేర అవినీతికి పాల్పడినట్లుగా ఆరోపణలున్నాయి. విశాఖ, విజయనగరం జిల్లాల్లోని దేవదాయ భూ కుంభకోణాలకు గత ప్రభుత్వ ప్రజాప్రతినిధులకు వినోద్‌కుమార్ సహకరించారని సమాచారం. వాటిపై సీబీఐ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపడుతున్నారు.

ఉపాధి కూలీల బకాయిలు చెల్లించండి: దుర్గాభవాని

విశాలాంధ్ర-ఏలూరు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల బకాయిలు చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏలూరు జిల్లా సీపీఐ ప్రధాన కార్యాలయం స్ఫూర్తి భవన్‌లో ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా సమితి సమావేశం ఏలూరు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు వరకా శ్యామల అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గాభవాని మాట్లాడుతూ ఏప్రిల్ నుంచి నేటి వరకు ఉపాధి కూలీల బకాయిలు చెల్లించలేదని, దీంతో వారు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతుందని, ఉద్దేశ పూర్వకంగా బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కేటాయించే నిధులలో కోత విధించిందని విమర్శించారు. ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం చేష్టలుడిగి చూస్తోందని తెలిపారు. 200 రోజుల పని దినాలకు సరిపడా నిధులు కేటాయించి, ఉపాధి హామీ పథకాన్ని ప్రోత్సహించే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహించి కేంద్రం మెడలు వంచుతామని హెచ్చరించారు. ఏలూరు జిల్లాలో మహిళా సమాఖ్యను బలోపేతం చేయాలని, తరచూ శాఖలు సమావేశం నిర్వహించి, సమస్యలపై గళం విప్పాలని కోరారు. నూతన శాఖలు ఏర్పాటు చేసే విధంగా మహిళ సభ్యులు క్రియాశీలకంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, కార్యనిర్వాహక అధ్యక్షురాలు కొండేటి బేబి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా, గోదావరి నీటి హక్కులకై ఉద్యమం

- నేడు జిల్లా కలెక్టర్ల ద్వారా సీఎంకు వినతులు
- ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా, గోదావరి నదీ జలాల పున: పంపిణీ ద్వారా రాష్ట్ర నీటి హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా సీఎం చంద్రబాబుకు ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం వినతిపత్రాలను అందజేయనుంది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ... ఈ వినతుల కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మొత్తం 13 డిమాండ్లతో కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లి వినతులు వినతులు ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వం బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు కృష్ణానదీ జలల పున: పంపిణీ ద్వారా రాష్ట్ర నీటి హక్కులను కాపాడాల్సిన సమయం ఆసన్నమైందని నేతలు సూచించారు. ఈనెల రెండో వారంలోపు ప్రభుత్వం తమ వాదనలతో కూడిన నివేదికను ఇవ్వాలని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే రెండు, మూడు విడతలుగా గత ప్రభుత్వ హయాంలో ట్రిబ్యునల్ ఆదేశించినప్పటికీ, ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. కేంద్ర ప్రభుత్వంలోని జలశక్తి విభాగం నుంచి 6 అక్టోబరు 2023న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా, గోదావరి వరదల నుంచి తమకు కేటాయించిన/కేటాయించాల్సిన నీటిని సమగ్రంగా విశ్లేషించి మన రైతాంగం పక్షాన బ్రిజేశ్‌కుమార్ ముందు మన వాదనలు విన్నవించాలన్నారు. ఏపీ విభజన చట్టానికి వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న/నిర్మించబోయే పాలమూరు-రంగారెడ్డి, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తి పోతల పథకం (రెండో విడత) ప్రాజెక్టులతో దిగువ రాష్ట్రమైన ఆంధ్ర ప్రదేశ్‌కు జరిగే అనర్థాలను ట్రిబ్యునల్ వారికి నివేదించాలని కోరారు. గోదావరి నీటి పంపిణీపై చర్చించేందుకు ఉభయ రాష్ట్రాల మధ్య ప్రత్యేక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఏటా పులిచింతలలో 30.23 టీఎంసీల నీరు ఉండేలా చూడాలని, కృష్ణా డెల్టాకు జూన్ మొదటి వారంలో నారుమళ్లు పెంచుకునేందుకు నీరు విడుదల చేయాలన్నారు. ప్రజల తాగునీటి అవసరాలకు నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేసే ఏర్పాటు చేయాలని, ఆయా అంశాలపై చర్చించేందుకు రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, సాగునీటి రంగ నిపుణులతో సీఎం చంద్రబాబు సమావేశం ఏర్పాటు చేయాలని ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ కోరారు.

అక్రమ క్వారీల తవ్వకాలు నివారించాలని, క్వారీల లీజుల హద్దులు ప్రకటించాలని, ఎన్టీఆర్ జిల్లాలో పవన్ గ్రానైట్స్ మెటల్ వర్క్సును సీజ్ చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర భూగర్భ గనులు, ఖనిజ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కలిసి వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, పక్కన విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు తదితరులు.

మాజీ ఎమ్మెల్యే శిల్పా అనుచరుడి హత్య

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారాంపురంలో శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అనుచరుడు సుబ్బరాయుడును ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎస్పీ ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. శిల్పా చక్రపాణి రెడ్డి వర్గీయుడైన జమాల్ రెడ్డి ప్రధాన అనుచరుడు సుబ్బరాయుడు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణి రెడ్డి విజయం కోసం పని చేశాడు. అతడిపై కొందరు స్థానిక నేతలు అసంతృప్తిని పెంచుకున్నారు. శనివారం అర్ధరాత్రి దాటాక దాదాపు 40 మంది ప్రత్యర్థులు కర్రలు, రాళ్లతో సుబ్బరాయుడు ఇంటిపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఇంట్లో వస్తువులను ధ్వంసం చేశారు. సుబ్బరాయుడు వెంటపడి కర్రలు, రాళ్లతో కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ప్రత్యర్థులు గ్రామంలో తిరుగుతూ భయానక వాతావరణం సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు సీతారాంపురం గ్రామానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనడంతో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో వైసీపీకి ఓటేసినందుకే హత్య చేశారని సుబ్బరాయుడు భార్య సుబ్బమ్మ ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పోలీస్ శాఖ
ఇ-వేలం ప్రకటన
Rc.No.S2/10/AP/OCTO/2023-24, Dt. 01-08-2024
ఆక్టోపస్, పోలీస్ శాఖ, ఆంధ్రప్రదేశ్ కొరకు వివిధ పాడైపోయిన/పనికిరాని వస్తువుల విక్రయం/తొలగించుట కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్/ వెబ్‌సైట్ అనగా., https://konugolu.ap.gov.in/ నుంచి తేదీ: 05.08.2024 నుంచి 12.08.2024 వరకు ఇ-వేలం పోర్టల్ ద్వారా బిడ్లు ఆహ్వానించడమైనది.
సం/- అడిషినల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆపరేషన్స్ (ఆక్టోపస్), ఎ.పి., మంగళగిరి
DIPR/13821/CL/ADVT-1/1/2021-22 Dt. 2-8-2024

మట్టీ @ మనిషి

మట్టీ...మనుషులు
రెండూ అనుసంధానమే
పంట పండించేటప్పుడు
పాదముద్రలై కదిలేటప్పుడు
కాలధర్మంలోకి ఒలికేటప్పుడు

మట్టిని ఎద్దేవా చేయకూ
మట్టిలో
మాణిక్యాలుండొచ్చు
మృత కళేబరాలుండొచ్చు
మట్టి అనేకనేక
మూలకాల సమాహారం
మట్టి మనలో
పరస్పర పూరకం

జీవం
ఎప్పటికైనా నిర్జీవమే
బతుక్కు భరోసానిచ్చేవన్నీ
నిర్జీవాలే...
అవే మనిషిని హతమార్చే వరకూ..
చలామణీ అవుతుంటాయ్
మలినం మనసుకు
లేకుండా చూసుకోవాలి
మట్టి.. విత్తును
మొలకెత్తించి ప్రాణం పోస్తుంది
మట్టి మానవ మనుగడకు
మహా భూమిక

అంతిమంగా..
నువ్వూ నేనూ మనందరమూ
ఎప్పుడో ఒకప్పుడు
మట్టిలో ఐక్యం కావల్సిందే
మట్టి ఇప్పుడు
సర్వంతర్యామి..!

డా. కటుకోజ్వల రమేష్,
సెల్: 9949083327

సాహితి

సముద్రమంత భావోద్వేగం కవిత్వమైతే...

జీవితం పచ్చని ఆశల ఊసులతో ఎన్నెన్నో హోయలుబోయే వాసంతసమీరం ఒకసారి...దిగులు అలలవెల్లువతో ఉప్పొంగే సముద్రమంత భావోద్వేగం మరోసారి. ప్రకృతి కరుణించి పచ్చ దనపుఒడిలో ప్రపంచాన్ని సేదదీర్చినట్టు పరిస్థితులు అనుకూలిస్తే ఉల్లాస భావోద్వేగాలు జీవితాల్ని సేదదీరుస్తుంటాయి. ప్రకృతి ప్రకోపించి ప్రకంపనలతో, జలవిన్యాసాలతో పరిపరివిధాలా భూమిని అతలాకుతలం చేసినట్టు పరిస్థితులు ప్రకోపిస్తే విషాద భావోద్వేగాలు జీవితాల్ని కల్లోలపరుస్తుంటాయి. భావోద్వేగం మనుషుల మధ్య ఆత్మీయతలకీ, మమతానురాగాలకీ పాదులు వేస్తుంటుంది. యాంత్రిక జీవనమనే జిగిబిగి జిలుగుల అల్లికల్లో కూరుకుపోయి అయోమయస్థితిలో దిక్కుతోచక అల్లాడిపోతూ తనను బ్రోచేవారికోసం తపించే మనిషికి కొండంత స్వాంతన కలిగిస్తుంటుంది. అనుబంధపు ఆమనికి పచ్చదనమై పోతుంటుంది. హృదయస్పందనలకు బాష్యం చెబుతుంటుంది. ప్రేమామృత కుండపోతై కురుస్తూ ప్రణయధారై పోతుంటుంది. పరిపరివిధాల భావోద్వేగాలు మనిషి జీవనమథనంలోంచి అమృతాన్నీ, హాలాహలాన్నీ వొలికిస్తుంటాయి. ఆ భావోద్వేగాలకు అక్షరాల్ని తొడిగే కవిత్వం వాటిని విశ్వజనీనం చేస్తుంటుంది. హృదయభాషను ఉదయమై వెలిగిస్తుంటుంది. మనిషికీ, మనిషికీ మధ్య సమైక్యతారాగాలను పలికిస్తుంటుంది.

'ఇక్కడ నేను క్షేమం-అక్కడ నువ్వు కూడా
ముసలి అమ్మా, పాత మంచం కోడూ
మన చిన్నబ్బాయీ, చెరువులో కొంగా...ఇప్పుడు రాత్రి, అర్ధరాత్రి
నాకేంతోచదు నాలో ఒకభయం/తెల్లని దళసరి మంచురాత్రి చీకటిఅంచు
దూరంగా పక్కదేరాలో కార్పొరేటే బూట్స్ చప్పుడు
ఎవరో గడ్డిమేట మీదనుంచి పడ్డట్టు-
నిశ్శబ్దంలో నిద్రించిన సైనికుల గురక
చచ్చిన జీవుల మొరలా వుంది/అబ్బ చలి! నెత్తురు చల్లబడే చలి!
పొడుగాటి చుట్ట కాల్చినా/లిండెల్(రూపాయి దాని పాపం
ఖరీదు)/లిండెల్ గుండెల్ హత్తుకున్నా
దాని సారానోరు నీరుతాగినా ఈ చలిపోదు....
స్పృహ తప్పిన ఎనేస్తీషియాలో/వెన్నెముక కర్రలా బిగిసింది!
యుద్ధం యుద్ధం/లిబియాలో బెర్లిన్‌లో స్తాలిన్ గ్రాడ్‌లో
స్వార్థం పిచ్చికుక్కలా పరుగెత్తింది
కనిపించే ఈ యూనిఫారం కింద
ఒక పెద్ద నిరాశ, ఒక అనాగరకత
బ్రిడ్జి కింద నదిలాగ రహస్యంగా వుంది
వదలలేని మోసపు ఊబిలాగ వుంది
నేనంటే నాకే అసహ్యం
అందుకే మరీమరీ చంపుతాను, మరీమరీ తాగుతాను
ఇంకేం చేసినా ఎవరూ ఒప్పుకోరు/ఇంకా తెల్లవారుతోంది
దూరంగా ఆల్ప్సు మీద మంచు దుఃఖంలా
కరుగుతోంది/ప్రభాత సముద్రం మీద వెండినౌకలా ఊగుతోంది
తిరిగి ఎప్పుడు మన ఊరు వస్తానో! నిన్ను చూస్తానో!
అందమైన నీ తెల్లని నవ్వు నీ మెడలో
గొలుసుగొలుసులుగా కదిలినప్పుడు
అదోవిధమైన చెమ్మగిలిన చూపు
నెమలిరెక్కలా విప్పుకున్నప్పుడు
ఎన్నాళ్లకి! ఎన్నాళ్లకి!/కొన్నివేల మైళ్లదూరం మనమధ్య
ఒక యుగంలా అడ్డుపడింది/ఇంక సెలవు మైడియర్
నిద్ర వస్తోంది మత్తుగా నల్లగా
అదుగో సెంట్రీ దేరా ముందు గోరీలా నిలబడ్డాడు

అదిగో ఇంకా/కార్పొరేట్ బూట్స్ చప్పుడు
కడుపులో నీళ్లు కదులుతున్నట్టు
జాగ్రత్త సుమీ జాగ్రత్త/నువ్వూ, పిల్లలూ, బల్లులూ అందరూ
మళ్లీ జవాబురాయ్ సుమీ/ఎన్నాళ్లకో మరి/సెలవ్! అబ్బా! చలి!
చలి గుండెల మీద కత్తిలా తెగింది
నీ రూపం నా దేహానికి వెచ్చగా తగిలింది'

('సైనికుడి ఉత్తరం' ఖండిక నుంచి)

అంటూ దేశ సరిహద్దులో భయానక యుద్ధవాతావరణంలో అహర్నిశలూ కాపలాకాసే సైనికుడి అంతరంగాన్ని అతడి ఉత్తరం ద్వారా వివరిస్తాడు కవికులతిలకుడు బాలగంగాధర తిలక్. వేలమైళ్ల దూరంలో వున్న తన కుటుంబసభ్యుల సమాచారాన్ని తెలుసుకునే నిమిత్తం అర్థాంగికి రాసే లేఖలో అతని భావోద్వేగం కవిత్వమైపోయింది. వెన్నెముక కర్రలా బిగుసుకుపోయినంత గడ్డకట్టిన చలి అతని నేపథ్యమైపోయింది. ఆ కవిత్వం అతని అంతరంగపుటలతో మనల్నీ సంలీనం చేస్తుంది. తనవాళ్లతో బాటు పాతమంచం కోడు, చెరువు కొంగ తాలూకు జ్ఞాపకాలు అతని భావోద్వేగంలో చోటుచేసుకున్నాయి. సైనికుల బూట్ల చప్పుడు మాటిమాటికీ గుర్తుచేసే కర్తవ్య నిర్వహణ అతనిని వదలలేని అనాగరిక మోసపు ఊబి అయిపోయింది. తనవాళ్ల కోసం అతనిలోని నిరీక్షణ దిగులు కరిగే ఆల్ప్సు మంచు దుఃఖాన్ని చేసింది. యుద్ధబీభత్సానికి పురికొల్పే అదుపు తప్పిన స్వార్థాన్ని చూపించింది. ఆ భావోద్వేగపు నోస్టాల్జియాలో అతని అర్థాంగి నవ్వు ఆమె మెడలోని కదిలే గొలుసైపోయింది. అతని చెమ్మగిలిన చూపు పురివిప్పిన నెమలిరెక్కైపోయింది. వారిద్దరి మధ్య దూరం ఒక యుగమైపోయింది. తాను వున్న దేరా ముందు కాపలాకాసే సెంట్రీ తనపాలిట గోరీ అయిపోయాడు. చలి అతని గుండెల్లో బాకులా దిగబడుతున్నా అతని జ్ఞాపకంలోని ఆమె రూపం అతనికి వెచ్చదనమైపోయింది. మొత్తంగా సైనికుడి లేఖ అయిపోయింది అతని నిలువెత్తు భావోద్వేగపు సరిహద్దురేఖ.

'భద్రతావలయాన్ని ఎగతాళి చేసి
అక్రమంగా సరిహద్దును దాటే ఆకతాయల్లే
ఆ పద్నాలుగో రోజుకు అటో- ఇటో/వద్దువద్దనుకుంటూనే
అజాగ్రత్తగా నేననుమతించిన అసమ్మతి కణాలతో
మరో సగభాగమై నువ్వెందుకు కలిసావురా కన్నా?
నీకు పంచేందుకు రక్తం లేకే కదా
నిన్ను పెంచేందుకు తీరిక లేకే కదా
నీ అక్కకు ఇంకా పాకడమైనా రాలేదనే కదా,
నేనిన్ను వద్దనుకున్నది!
అనుమతి లేకుండా అస్తిత్వం పొందిన నీ నేరానికి-
నా టెంపరరీఉద్యోగమూ, ఆరోగ్యమూ, నీకు మరణశిక్షను ఖాయం చేస్తే
తల్లడిల్లుతూనే,/తప్పొప్పుల మధ్య తడబడుతూనే
తలారినై బల్లెక్కి/రబ్బరు చేతుల ముసుగు నీ ముఖంపై కప్పి,
అభిమన్యుని శరాలకప్పజెప్పి/నిస్సహాయులైన పాండవుల్లా రోదిస్తూ
పెథిడ్రిన్ సెడేషన్‌లో నిన్ను పోగొట్టుకొని
పగిలిన జిల్లేడుకాయ తాలూకు పింజనై సోలిపోతూ
నాలోని అమ్మను పాతిపెట్టుకొని/చెరకు పిప్పినై పారిపోతూ
కంసుడి కత్తి లాంటి ప్లాస్టిక్ బకెట్ మింగిన
ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాంటి నిన్ను చూసి
మళ్లీ నా పొత్తిళ్లలో పొదువుకోవాలనీ
పాలకై తడుపుకునే పెదవులుగా
అమ్మకై వెతుక్కునే చూపులుగా చెక్కుకోవాలనీ,
ఛిద్రకలసాన్ని పూర్ణశిల్పంగా దిద్దుకోవాలనీ,
ఇంత సుఖంగా నిన్ను చంపుకునే మార్గం కనిపెట్టిన వీళ్ల ముఖాలపై
ఉమ్మనీళ్లతో ఉమ్మేయాలనీ వెర్రి ఆవేశంగానూ,
కడుపు చించుకుంటే/మనసు గాయం అయ్యి/కడివెడు కన్నీళ్లు
దుఃఖంగానూ వుందిరా
అయ్యో!/పాలింకి పోవడానికున్నట్టు/మనసింకిపోవడానికీ-
మాత్రలుంటే ఎంత బావుండు!

('అబార్షన్ స్టేట్‌మెంట్' ఖండిక నుంచి)

అంటూ పరిస్థితులకు తలొగ్గి బలవంతంగా అమ్మతనాన్ని పోగొట్టుకునే ఒక ఇల్లాలి మానసిక క్షోభకూ, పశ్చాత్తాపపు భావోద్వేగానికి అక్షరరూపమిస్తుంది పాటిబండ్ల రజని. ఒక విలక్షణ సందర్భం ఇక్కడ కవితావస్తువైపోయింది. స్త్రీ జీవితం లోని సున్నితమైన అంశం అక్షరరూపం దాల్చింది. కుటుంబ పరిస్థితులు ఊహించని అబార్షన్‌కు దారి తీస్తే ఆ పరిస్థితుల్లోంచి ఉద్భవించిన భావోద్వేగం కవిత్వమైపోయింది. అందులోని జీవనవిషాదాన్నీ, తల్లడిల్లే ఒక మాతృహృదయ నిర్వేదాన్నీ వినిపించింది.

తాను విధించుకున్న భద్రతావలయాన్ని ఛేదించి అనుకోని ఉపద్రవానికి దారితీసిన పురుషాహంకారాన్ని ప్రశ్నిస్తూనే కుటుంబ పరిస్థితుల్నీ, ఒక మధ్యతరగతి స్త్రీ జీవన అవస్థల్నీ ఏకరువు పెట్టింది. దంపతుల మధ్య చోటుచేసుకునే అవగాహనారాహిత్యాన్ని ఎత్తిచూపించింది. ఇక్కడ ఒక తల్లిని అభిమన్యుని శరాలకప్పజెప్పి నిస్సహాయులైన పాండవుల్లా రోదించేలా, పగిలిన జిల్లేడుకాయ తాలూకు పింజలా సోలి పోయేలా చేసిన పరిస్థితి ఆమె భావోద్వేగమైంది. ఆ భావోద్వేగం పశ్చాత్తాపమైపోయింది. ఆమెలోని అమ్మను హత్యచేసిన ప్లాస్టిక్ బక్కెట్ కంసుడి కత్తి అయిపోయింది. ఆ భావోద్వేగం మళ్లీ బిడ్డను పొత్తిళ్లలో మనసారా పొదువుకోవాలని, పాలకి వెదుక్కొనే పెదవులకోసం, అమ్మకోసం వెతుక్కునే చూపులకోసం తపించేలా చేసింది. ఆవేదన భరించలేని స్థితిలో మనసింకిపోయేలా చేసే మాత్రల కోసం తపించే స్థాయికి వెళ్లిపోయింది ఆ భావోద్వేగం. సరిహద్దులో కాపలా కాస్తూ సైనికుడు దేశంకోసం శత్రువుతో యుద్ధానికి సన్నద్ధమవుతున్నట్టు జీవన సంఘర్షణలో పయనిస్తూ ఒక స్త్రీ కుటుంబ మనుగడ కోసం పురుషాహంకారంతో యుద్ధానికి సన్నద్ధమవుతూనే వుంటుంది. ఈ రెండు సందర్భాల సముద్రాల్లోంచీ బాధామయ భావోద్వేగపు అలలు ఉవ్వెత్తుకు ఎగిసిపడుతూనే వుంటాయి. భావోద్వేగం మనిషిలోని మనిషి తనానికి అచ్చమైన ప్రతిరూపం. అందుకే అది పదికాలాలపాటు మనుషుల మధ్య అనుబంధాల వంతెనల్ని నిర్మిస్తూనే వుంటుంది. వసుధైకజీవన పరమార్థాన్ని ప్రతిఫలింపజేస్తూనే వుంటుంది.

-డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, 9177732414

తెలంగాణ కవితా వైభవం

(పాల్కురికి నుండి గద్దర్ వరకు)

'తెలంగాణ భాషా మాండలికమని, ఇది రాయరాద' నే సవాలుకు వందేండ్ల కిందనే జవాబు దొరికింది. నాటి గోలుకొండ కవుల సంచిక నుంచి, ఇప్పటివరకూ వందలాది పుస్తకాల్లో తెలంగాణ కవులు రాసిన కవిత్వం, భాషా, సామెతలు, జాతీయాలు, నుడికారాలు మొదలైనవి విరివిగా చోటుచేసుకున్నయన్న దానికి ఇటీవలె ఆచార్య అనుమాండ్ల భూమయ్య రాసిన 'తెలంగాణ కవితా వైభవం' (పాల్కురికి నుండి గద్దర్ వరకు) అనే పుస్తకం గొప్ప నిదర్శనంగా నిలుస్తోంది. తెలంగాణ కవితా వైభవాన్ని, సాహిత్య పరిమళాల్ని ఇది బయటి ప్రపంచానికి భీకర స్వరంతో వినిపించిందని చెప్పాలి. ఈ గ్రంథ రచయిత ప్రాచీన, ఆధునిక సాహిత్యాలకు వారధిగా నిలిచిన అతి కొద్దిమందిలో ఒకరు. సుప్రసిద్ధ అధ్యాపకులుగా, కవిగా, రచయితగా, గొప్ప ఉపకులపతిగా పేరు గడించారు. ఆచార్య భూమయ్య ఎంతో నిగూఢమైన ఆధ్యాత్మిక విషయాలను కూడా చాలా సరళంగా సుబోధకంగా సామాన్య పాఠకుడికి అర్థమయ్యేలా రాస్తారు.

గ్రంథ సమీక్ష



'తెలంగాణ కవితా వైభవం' అనే పేరుతో 380 పేజీల ఉద్గ్రంథాన్ని ఆచార్య భూమయ్య 2023 సెప్టెంబర్‌లో ప్రచు రించారు. ఇందులో పాల్కురికి నుండి గద్దర్ వరకు గల కావ్య, కవితా విశేషాల్ని తెలియజేశారు. ప్రధానంగా పాల్కురికి సోమ నాథుడిపై 8, కొఱవి గోపరాజుపై 3, బమ్మెర పోతనపై 5, శేషప్ప గురించి 1, గోలకొండ కవులపై 4, కాళోజి నారాయణరావుపై 1, దాశరథి కృష్ణమాచార్యపై 2, డా. సి. నారాయణరెడ్డిపై 5, డా. పల్లా దుర్గయ్యపై 3 , పొట్లపల్లి రామారావుపై 1, గద్దర్ గురించి 2 అన్ని కలిపితే 35 వ్యాసాలున్నాయి. ప్రతీదీ దేనికదే ప్రత్యేకమైనదని చెప్పాలి. రచయిత సందర్భోచితంగా తెలంగాణ కవితా వైభవాన్ని వేనోళ్ళ కొనియాడారు. ప్రాచీన సాహిత్యంలోని జఠిలమైన పద్యాల విశేషాల్ని బాగా అర్థమయ్యేట్లు వివరించారు. వ్యాసాల్లో పరిశోధన, తులనాత్మకు చక్కని స్థానం కల్పించారు. పాఠకులు తప్పక చదవవలసిన పుస్తకమిది.

ఈ గ్రంథంలోని వ్యాసాల్లో కవులు వారి రచనా విశేషాల్ని కూలంకషంగా పేర్కొంటూ...వాటి ప్రత్యేకతల్ని ఎంతో రమణీయంగా చర్చించారు. ఓ మూడు నాలుగు వ్యాసాల్లో సంభాషణాత్మక పద్ధతి ఇట్టే ఆకర్షిస్తుంది. వేదకాలంలో ఈ విధానం బహుళ ప్రాచుర్యంలో ఉండేది. గురుకులాల్లో గురుశిష్యుల మధ్య జరిగిన సంభాషణ వల్ల కష్టమైన అంశాలు కూడా సులభంగా బోధపడేవి. తెలుగు సాహిత్య విమర్శలో బహుశా ఈ పద్ధతిని వీరే ప్రవేశం కల్పించారనిపిస్తోంది. 'పాల్కురికి సోమనాథుడు, కొఱవి గోపరాజు, పోతన, శేషప్ప ప్రాచీన కవులు. గోలకొండ కవులు, కాళోజి, దాశరథి, సి. నారాయణరెడ్డి, పల్లా దుర్గయ్య, పొట్లపల్లి రామారావు, గద్దర్ ఆధునికులు, వీరు కావ్య కీర్తిశేషులు. ప్రాచీన, ఆధునిక కవులు మొత్తం పదకొండు. పాల్కురికి సోమన మొదలుగా గద్దర్ వరకు గల కవుల కవితా విశేషాలకు సంబంధించిన ఈ వ్యాస సంపుటికి 'తెలంగాణ కవితా వైభవం' అని పేరు పెట్టాను. 800 సంవత్సరాల మధ్యకాలంలో ఉన్న ప్రాచీన, ఆధునిక తెలంగాణ కవుల కవితా విశేషాలు, సామాజికాంశాలు తెలుసుకోవటానికి ఈ వ్యాస సంపుటి కొంతైనా ఉపకరిస్తుందను కొంటున్నాను.' అని ఆచార్య భూమయ్య ఈ పుస్తకానికి రాసిన 'నా మాట' లో పేర్కొన్నారు. అసలు కొన్ని విషయాలే కాదు చాలా అంశాల్ని రచయిత ఈ గ్రంథం ద్వారా ప్రస్ఫుటం చేశారు.

డా. బడిగె ఉమేశ్ , 9494815854

నీడ చూపించిన అసలు చిత్రం

మంచి పుస్తకం

విశ్వ విఖ్యాత మేధావి, న్యాయ కోవిదుడు, దళితోద్యమ కాగడా డా.అంబేద్కర్ జీవిత చరిత్రలు చాలానే వచ్చాయి. అంబేద్కర్ మీద జరిగినంత చర్చ చాలా తక్కువమంది మీదే జరిగి ఉంటుంది.

ఆయన రెండవభార్య సవిత అంబేద్కర్ మరణించిన 34 సంవత్సరాలకు "డా. అంబేద్క రాంచ్య సహవాసత్" గ్రంథం మరాఠీలో వెలువరించారు. ఇది పేరుకు సవిత జీవిత చరిత్ర లాంటిదే అయినా అందులో సర్వత్రా అంబేద్కర్ ప్రస్తావనే ఉంటుంది. మరాఠీలో ఈ గ్రంథం ఇంగ్లీషులో "బాబా సాహెబ్: మై లైఫ్ విత్ అంబేద్కర్" రూపంలో రావడానికి 31ఏళ్లు పట్టింది. నదీం ఖాన్ సవిత మరాఠీలో రాసిన గ్రంథాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు.

అంబేద్కర్ మొదటి భార్య 1935లో మరణించారు. ఆ తరవాత 1948లో అంబేద్కర్ సవితను పెళ్లి చేసుకున్నారు. అప్పటికి అంబేద్కర్‌కు 57 ఏళ్లు. సవితకు 39 ఏళ్లు. సవిత వృత్తిరీత్యా డాక్టర్. ఆమె అంబేద్కర్‌కు కూడా వైద్యంచేశారు. ఆ పరిచయమే పెళ్లికి దారితీసింది. ఇద్దరి మధ్య వయసు తేడా 18ఏళ్లు. సవిత అంబేద్కర్‌ను పెళ్లాడే నాటికి అంబేద్కర్ కుమారుడు యశ్వంత్ అంబేద్కర్‌కు 16 ఏళ్లు. అంటే అంబేద్కర్ రెండో పెళ్లి చేసుకున్న సవితకు, కొడుకు యశ్వంత్‌కు మధ్య వయసులో తేడా దాదాపు మూడేళ్లు.

డా.సవితను పెళ్లాడాలన్న ఆకాంక్ష మొదట డా.అంబేద్కర్ నుంచే వచ్చింది. ఆమె వెంటనే ఒప్పుకోలేదు. రెండోసారి ప్రతిపాదించిన తరవాత సరేనన్నారు.

1948 ఏప్రిల్ 15వ తేదీన ఇద్దరికీ పెళ్లి జరిగింది. ఈ పెళ్లికి ముందు నుంచే సవిత అంబేద్కర్‌కు చికిత్స చేస్తున్నారు. పెళ్లయిన తరవాత అంబేద్కర్ ఆరోగ్యాన్ని అత్యంత జాగ్రత్తగా చూసుకున్నారు. అంబేద్కర్‌కు రక్తపోటు, మధుమేహం, కీళ్లనొప్పులు లాంటి అనేక సమస్యలు ఉండేవి. డా.సవిత చికిత్స, పరిచర్యే లేకపోతే అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా అంత చురుకుగా, సమర్థంగా పని చేయగలిగేవారు కాదేమో.

అంబేద్కర్ జీవితంలో రెండవ భార్య సవిత పాత్ర చాలా కీలకమైంది. తన జీవిత చరిత్ర రాయాలని సవిత ప్రయత్నించినా అది చివరకు అంబేద్కర్ జీవిత చరిత్రలాగే కనిపిస్తుంది. అయితే అంబేద్కర్‌కు వైద్యం చేసినప్పుడు, పెళ్లి చేసుకున్న తరవాత, ఆయన ఆరోగ్య సంరక్షణలో నిమగ్నమైనప్పుడు సవిత తన ప్రత్యేక వ్యక్తిత్వానికి భంగం కలగనివ్వలేదు. 1956లో 65వ ఏట అంబేద్కర్ మరణించిన తరవాత ఆమె అనేక నిందలు మోయాల్సి వచ్చింది. ఆమె అంబేద్కర్‌కు విషం ఇచ్చి చంపారు అన్న అసత్య ప్రచారాలు



ముమ్మరంగా జరిగాయి.

సామాజిక కార్యకర్తగా సవితకు ప్రత్యేకత ఉంది. నిందలపర్వం ముగిసిన తరవాత ఆమె మళ్లీ సామాజిక కార్యకలాపాల్లో మునిగిపోయారు. 94ఏళ్ల పాటు నిండైన జీవితం గడిపారు. సవిత కుటుంబం అభ్యుదయభావాలు గలది. ఆమె ఇంట్లో అప్పటికే ఆరుగురు కులాంతర వివాహాలు చేసుకున్నారు కనక అంబేద్కర్‌ను పెళ్లి చేసుకోవడానికి ఆ బ్రాహ్మణ కుటుంబం ఏ మాత్రం అడ్డు చెప్పలేదు.

తన ఆత్మకథ పేర అంబేద్కర్ కథ చెప్పడంలో కేవలం తన దృక్కోణం నుంచి మాత్రమే చెప్పలేదని, అంబేద్కర్‌తో కలిసి జీవించినప్పుడున్న అనుభవాలు, ఆయన మరణం తరవాత భరించిన అగ్నిపరీక్షలు కూడా చెప్పాలనుకున్నాను అని సవిత చెప్పారు.

పెళ్లి కాకముందే అంబేద్కర్ సవితకు లేఖలు రాసేవారు. ఈ లేఖల వివరాలను సవిత ఈ గ్రంథంలో వెల్లడించారు. సాధారణంగా ఇలా వ్యక్తిగతమైన ఉత్తరాలలోని అంశాలు బయటపెట్టేవారు తక్కువే. అంబేద్కర్ రాసిన ఉత్తరాల నిండా సవిత మీద అపారమైన అనురాగం కనిపిస్తుంది. సవితను ఆయన ఎంతగా ఇష్టపడ్డాడో, ఆ లేఖల్లో ఎంత గాఢమైన భావుకత ఉందో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మేధోపరంగా వారిద్దరి మధ్య సామ్యం ఉండేది. ఇద్దరూ కలిసే బౌద్ధ మతం స్వీకరించారు. అంబేద్కర్ ఆరోగ్య పరిరక్షణే తన జీవితాశయం అన్నట్టుగా సవిత ప్రవర్తించారు. ఆమె కారణంగా తన ఆయుర్దాయం కనీసం పదేళ్లు పెరిగింది అని అంబేద్కర్ స్వయంగా చెప్పారు.

తన జీవిత అంత్య ఘడియల దాకా సవిత అంబేద్కర్ మార్గాన్నే అనుసరించారు. సవిత అసలు పేరు శారద. పెళ్లైన తరవాత సవితగా మార్చు కున్నారు. కానీ అంబేద్కర్ మాత్రం శారు అనే అనేవారు.

చాలామంది పురుషుల విజయాల వెనక వారి జీవిత సహచరుల తోడ్పాటు, కొన్ని సందర్భాలలో త్యాగమూ ఉంటుంది. సవిత తన వ్యక్తిత్వానికి భంగం కలగకుండానే అంబేద్కర్‌కు నీడలా వ్యవహరించారు. సత్యం తెలుసుకోవాలనుకునే వారు డా. సవిత లాంటి ఆత్మ కథలు చదివితే అంబేద్కర్ గొప్పతనం మరింత స్పష్టంగా తెలిసి వస్తుంది.

గొప్ప వ్యక్తులుగా వెలిగిన వారి వెనక నీడలా అనుసరించిన వారి తోడ్పాటు, నిబద్ధత ఎంత గహనమైనవో ఇలాంటి గ్రంథాల వల్ల అర్థం అవుతుంది. గొప్ప మనుషుల విజయం వెనక ఓ స్త్రీ ఉంటుంది అన్నది నానుడి. ఈ మాట డా. సవిత విషయంలో అక్షరసత్యం. ఆవిడ నీడగా మిగిలిపోకుండా సొంత వ్యక్తిత్వాన్ని నిలుపుకోగలిగారు. నీడగా ఉంటూనే అంబేద్కర్ వ్యక్తిత్వం ఎంత నిఖార్సైందో చూపించారు.

-ఆర్వీ రామారావ్

15 నగరాలకు జలగండం

- పెరుగుతున్న సముద్ర నీటిమట్టం
- చెన్నైలోని చాలాప్రాంతాలు నీటమునిగే ప్రమాదం

చెన్నై: భారత్‌లోని తూర్పు, పశ్చిమతీర ప్రాంతాలకు చెందిన 15 నగరాలకు జలగండం ఉన్నట్లు బెంగళూరుకు చెందిన 'సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ స్టడీస్' హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు పెరుగుతున్న భూతాపం, ఎప్పటికప్పుడు మారుతున్న వాతావరణ పరిస్థితులపై ఆ సంస్థ చేసిన అధ్యయనంలో దిగ్భ్రాంతికర అంశాలను వెల్లడించింది. ముఖ్యంగా 2040 నాటికి తమిళనాడు రాజధాని చెన్నై నగరంలోని అనేక ప్రాంతాలు నీట మునగడం తథ్యమని స్పష్టం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణంలో వస్తున్న మార్పులు, భూతాపం తదితరాలపై అధ్యయనం చేస్తున్న ఆ సంస్థ.. మన దేశంలోని తూర్పు, పశ్చిమతీర ప్రాంతాలకు చెందిన 15 నగరాలకు ముప్పు పొంచి ఉన్నట్లు ప్రకటించింది. ఇందులో ముంబై, చెన్నై, విశాఖపట్నం వంటి నగరాలుండడం గమనార్హం. రోజురోజుకు పెరుగుతున్న జనాభా కారణంగా పలు సముద్రతీర ప్రాంతాలు జనమయంగా మారుతున్నాయి. ఈ క్రమంలో నెలకొన్న వివిధ పరిణామాల వల్ల సముద్రపు అడుగుభాగం క్రమేణా పెరుగుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుల కారణంగా సముద్రం నీటిమట్టం పెరిగి, తీరంలో ఉండే లోతట్టునగరాలను ముంచెత్తే అవకాశముందని తెలిపింది. ఈ ప్రభావం చెన్నైపై కొంతమేర పడే అవకాశముంది. ఆ మేరకు 2040 నాటికి

చెన్నైనగరంలో 7.29 శాతం భూభాగం నీటిలో మునిగిపోవచ్చని అంచనా. 7.29 శాతం అంటే 86.6 చదరపు కి.మీటర్ల భూభాగం సముద్రంలో మునిగిపోతుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా చెన్నై హార్బర్, అడయార్ పార్కు, ఐల్యాండ్ గ్రౌండ్, పల్లిక్కరణై ప్రాంతం నీట మునిగే అవకాశముంది. 2060 సంవత్సరంలో 9.65 శాతం (114.31 చ.కి.). 2080లో 15.11 శాతం (159.28 చ.కి.) 2100 సంవత్సరం నాటికి 16.9 శాతం (207.04 చ.కి) నీట మునిగిపోవచ్చని అంచనా. వాతావరణ పరిణామాల నేపథ్యంలో ఇది మరింత అధికమయ్యే అవకాశం కూడా ఉంది. కాగా 1987 నుంచి 2021 వరకు చెన్నైలో సముద్రమట్టం 0.679 సెం.మీటర్లు పెరిగిందని, ఏడాదికి ఒకసారి 0.066 సెం.మీటర్లు చొప్పున పెరుగుతోందని అధ్యయన నివేదికలో వెల్లడించింది. వాస్తవానికి ప్రస్తుతం అసెంబ్లీగా వున్న జార్జ్‌కోట ప్రహరీ వరకు సముద్ర తీరం ఉండేది. బ్రిటీషు పాలనలో జాలర్లు జార్జ్‌కోట ప్రహరీ వరకు పడవలతో వచ్చి, చేపల్ని తీసుకువెళ్లే ఫొటోలే ఇందుకు నిదర్శనం.

అయితే తరువాత జరిగిన పరిణామాల్లో భాగంగా సముద్రపు నీరు వెనక్కి మళ్లిందని సీనియర్లు గుర్తు చేసుకుంటున్నారు. కానీ ఇప్పుడు వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా ఈ నీరు ముందుకొస్తుందని, అనేక ప్రాంతాలు మునిగిపోవడం ఖాయమని అధ్యయన నివేదిక హెచ్చరిస్తోంది.

సెల్ఫీ తీసుకుంటూ... మృత్యు ఒడిలోకి యువతి

ముంబై: మహారాష్ట్రలోని పర్యాటక ప్రదేశం బోరాన్ ఘాట్‌లో ఓ యువతి సెల్ఫీ తీసుకుంటుండగా 100 అడుగుల లోయలోకి జారి పడిన ఘటన ఇది. పోలీసుల వివరాల ప్రకారం మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలకు అక్కడి జలపాతాలు పొంగిపొర్లుతుండటంతో పర్యాటకులు భారీగా పోటెత్తారు. పూణెకు చెందిన ఓ పర్యాటక బృందం బోరాన్ ఘాట్ సందర్శనకు వచ్చింది. నస్రీన్ అమీర్ ఖురేషీ అనే యువతి సెల్ఫీ తీసుకుంటుండగా జారి 100 అడుగుల లోతైన లోయలో పడిపోయింది. స్పందించిన హోంగార్డు, స్థానికుల సహాయంతో లోయలోకి దిగి ఆమెను కాపాడారు. చికిత్స నిమిత్తం ఆమెను సతారాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించామని, పరిస్థితి విషమంగా ఉందని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సోమవారం వరకు మూసివేయాలనిజిల్లా కలెక్టర్ జితేంద్ర దూడి ఆదేశించారు.

తమిళనాడులో బీజేపీ దిద్దుబాటు చర్యలు

చెన్నై: సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో ఘోర పరాజయం చవిచూసిన భారతీయ జనతా పార్టీ (బీజేపీ) దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఆ పార్టీకి చెందిన జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చేందుకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై నిర్ణయించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లిన అన్నామలై... అక్కడ పార్టీ పెద్దలతో వివిధ అంశాలతో పాటు పార్టీ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించి, మళ్లీ రాష్ట్రానికి చేరుకున్నారు. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికల నాటికి పార్టీ శ్రేణులను సమాయత్తం చేసే దిశగా చర్యలు చేపట్టనున్నారు. ఇందులోభాగంగా ఆ పార్టీకి ఉన్న 66 మంది జిల్లా అధ్యక్షుల్లో 20 మందిని మార్చాలని ఆయన భావిస్తున్నారు. కాగా, ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసిన స్థానాల్లో ఒక సీటులో కూడా గెలవలేదు. కానీ, 12 స్థానాల్లో రెండో స్థానంలో నిలిచింది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అసెంబ్లీ సీట్లను గెలుచుకునేందుకు అన్నామలై వ్యూహ రచన చేస్తున్నారు. ఆ దిశగా పార్టీ శ్రేణులను ఇప్పటి నుంచే సంసిద్ధం చేస్తున్నారు.

ఎస్పీ నేతలపై ఎఫ్ఐఆర్: బీజేపీ

లక్నో: అయోధ్యలో బాలికపై లైంగిక దాడి కేసుకు సంబంధించి ఎస్పీ నేతలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేశారని దీనిపై ఆ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఏం సమాధానం చెబుతారని జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి ప్రశ్నించారు. దర్యాప్తు పూర్తయ్యేంత వరకూ ఎవరినీ కాపాడేందుకు అఖిలేశ్ ప్రయత్నం చేయరాదని అన్నారు. ఈ ఘటనపై బీజేపీ నేత షెజాద్ పూనావాలా స్పందించారు. నిత్యం ఓబీసీ, దళిత్, మైనారిటీలు (పీడీఏ) అంటూ మాట్లాడే అఖిలేశ్ యాదవ్ ఇప్పుడు వెనుకబడిన వర్గాలకు చెందిన బాలికపై వేధింపులు జరిగితే మౌనం దాల్చారని మండిపడ్డారు. డీఎన్ఏ టెస్ట్‌కు అఖిలేశ్ డిమాండ్ చేయడం నిందితుడికి క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నంలో భాగం కాదా అని నిలదీశారు. ఎస్పీ కార్యకర్తలు ఈ నేరానికి పాల్పడ్డారని, ఈ వ్యవహారంపై డింపుల్ యాదవ్ కూడా మౌనంగా ఉన్నారని ఆరోపించారు. ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం పీడీఏ గురించి మాట్లాడే ఎస్పీ నేతల నిజస్వరూపం ఇప్పుడు బయటపడిందని చెప్పారు. ఈ ఘటనపై దోషులను యోగి సర్కార్ విడిచిపెట్టే ప్రసక్తే లేదని, కఠినంగా శిక్షిస్తామని తెలిపారు.

2029లోనూ విపక్షంలోనే 'ఇండియా' : అమిత్ షా

చండీఘడ్: విపక్షాలు ఏం చేసినా 2029లో మళ్లీ ఎన్డీయే అధికారంలోకి వస్తుందని, మోదీ ప్రధాని అవుతారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. గత మూడు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుచుకున్న స్థానాల కంటే బీజేపీకి ఈ ఎన్నికల్లో అధిక స్థానాలు లభించాయనే విషయం వారికి తెలియదని ఎద్దేవా చేశారు. అస్థిరతను కోరుకుంటున్న ఈ నేతలు పదేపదే ఈ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగదని ప్రచారం చేస్తున్నారని, తమ ప్రభుత్వం ఐదేళ్ల పదవీ కాలం పూర్తిచేయడంతో పాటు రానున్న ఎన్నికల్లోనూ విజయం సాధించి తదుపరి ఎన్డీయే ప్రభుత్వం కొలువు తీరుతుందని పేర్కొన్నారు. చండీఘడ్‌లో ఆదివారం 24 గంటల మంచినీటి సరఫరా ప్రాజెక్టును కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడారు. విపక్ష ఇండియా కూటమి మరోసారి విపక్షంలో కూర్చునేందుకు సిద్ధపడాలని చెప్పారు. విపక్ష పాత్ర పోషించడం ఎలా అనేది వారు నేర్చుకోవాలని ఆయన హితవు పలికారు. విపక్షం ఏం చేసినా అధికారంలోకి రావడంజరిగేపని కాదని చెప్పారు.

రాహుల్‌ని అరెస్ట్ చేసే ధైర్యముందా?

కాంగ్రెస్ నేత సింఘ్వీ



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఈడీ అధికారులు అరెస్ట్ చేస్తే చూస్తూ ఊరుకోమని ఆ పార్టీ సీనియర్ నేత అభిషేక్ మను సింఘ్వీ హెచ్చరించారు. ఆదివారం ఆయన ఢిల్లీలో మాట్లాడుతూ... రాహుల్‌ను అరెస్ట్ చేసే ధైర్యముందా అంటూ బీజేపీకి సవాల్ విసిరారు. అరెస్ట్ చేస్తే బీజేపీ శవపేటికకు అరెస్టే చివరి మేకు అవుతుందని హెచ్చరించారు. లోక్‌సభలో రాహుల్ చక్రవ్యూహ ప్రసంగం తరువాత దర్యాప్తు సంస్థలు రాహుల్‌పై నిఘా పెట్టాయన్నారు. రాహుల్ ఏమన్నారంటే... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనపై దాడులు చేసేందుకు సిద్ధమవుతోందని ఆరోపించారు. 'చక్రవ్యూహం' అంటూ తాను చేసిన ప్రసంగం కేంద్ర ప్రభుత్వ పెద్దలకు నచ్చలేదన్నారు. ఆ ప్రసంగం నేపథ్యంలో త్వరలోనే తనపై ఈడీ దాడులకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని తెలిపారు. ఆ ఇద్దరిలో (మోదీ, అమిత్‌షా) ఒకరికి తన చక్రవ్యూహం ప్రసంగం నచ్చలేదని తెలుస్తోందని... అందువల్లే తనపై దాడులకు సిద్ధమవుతున్నట్లు ఈడీలో పనిచేస్తున్న కొంతమంది తెలిపారని రాహుల్ పేర్కొన్నారు. 'ఈ దాడుల కోసం ఎదురుచూస్తున్నా. చాయ్, బిస్కట్లు సిద్ధంగా ఉంచండి' అని ఈడీ డైరెక్టరేట్ ఖాతాను ట్యాగ్ చేస్తూ రాహుల్ గాంధీ శుక్రవారం తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసిన సంగతి తెలిసిందే.

గ్యాంగ్‌స్టర్ ఇన్‌స్టా ఖాతాలో తీహార్ జైలు ఫొటోలు

విచారణకు ఆదేశం

న్యూఢిల్లీ: తీహార్ జైలులో శిక్ష అనుభవిస్తున్న పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ నవీన్ బాలి తన మొబైల్ ఫోన్ ద్వారా జైలు ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నాడు. తన ఇన్ స్టా ఖాతా నుంచి పలుమార్లు జైలుకు సంబంధించిన ఫొటోలను ఇంటర్నెట్‌లో అప్‌లోడ్ చేశాడు. ఈ విషయాన్ని హర్యానా ఇంటెలిజెన్స్ విభాగం... తీహార్ జైలు డైరెక్టర్ జనరల్‌కు, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు లేఖలు పంపింది. దాంతో ఈ ఘటనపై విచారణ జరపాలని స్పెషల్ సెల్ పోలీసులకు, క్రైమ్ బ్రాంచ్ పోలీసులకు పోలీస్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. జైలులో ఉన్న నవీన్ బాలిపై హత్య, దోపిడీ, హత్యాయత్నం తదితర కేసులు ఉన్నాయి. అతను నీరజ్ బవానా గ్యాంగ్‌లో ముఖ్యమైన సభ్యుడు. చాలా ఘటనల్లో అతడు నీరజ్‌కి అసోసియేట్‌గా ఉన్నాడు. 2021లో రోహిణి కోర్టులో జితేంద్ర గోగిని హత్య చేసిన కేసులో కూడా నవీన్ బాలీ నిందితుడిగా ఉన్నాడు. అయితే హర్యానా పోలీసులు ఈ మధ్య నేరస్థుల సోషల్ మీడియా ఖాతాలను స్కాన్ చేస్తున్నారు. ఈ సమయంలో నవీన్ బాలి ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో జైలు చిత్రాలను పోస్ట్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించి హర్యానా ఇంటెలిజెన్స్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ అశోక్ మిట్టల్... తీహార్ జైలు డైరెక్టర్ జనరల్ సతీశ్ గోల్చా, ఢిల్లీ పోలీస్ కమిషనర్‌కు లేఖ రాశారు. మే, జూన్‌లో మూడు సార్లు ఫొటోలు అప్‌లోడ్ చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. చివరిసారిగా జూలై 8న బాలీ ఇన్‌స్టాగ్రామ్‌లో జైలు ఫొటోను అప్‌లోడ్ చేశాడు. ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోని చాలామంది నేరస్థులు తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే వాటిని జైలు నుంచి కాకుండా బయట ఉన్న వారి అనుచరులు పోస్ట్ చేస్తారు. కోర్టులో హాజరుపరిచే సమయంలో వారి వీడియోలను తీసి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో పెడుతారు. కానీ నవీన్ బాలి పెడుతున్న ఫొటోలు జైలు నుంచి అప్‌లోడ్ అవుతున్నాయి.

'మీలాగే దేశాన్ని రక్షిస్తా'

ఆర్మీకి చిన్నారి లేఖ

తిరువనంతపురం: కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి విపత్తు ఎన్నో కుటుంబాలను నామరూపాలు లేకుండా చేసింది. భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి గ్రామాలను నేలమట్టం చేసిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. సహాయక చర్యల్లోకి దిగిన భారత ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, అటవీ శాఖ బృందాలు మట్టి దిబ్బల్లో, కొండ చరియల్లో చిక్కుకుపోయిన వారిని తమ ప్రాణాలకు తెగించి కాపాడుతున్నారు. వీరికి దేశంపై ఉన్న ప్రేమ, పనిలో నిబద్ధతను చూసి ఓ చిన్నారి వారికి లేఖ రాశాడు. ఈ లేఖకు ఆర్మీ కూడా స్పందించడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వయనాడ్‌కు చెందిన మూడో తరగతి విద్యార్థి భారత ఆర్మీకి లేఖ రాస్తూ 'ప్రియమైన ఇండియన్ ఆర్మీ... నా జన్మస్థలం వయనాడ్‌లో ప్రకృతి విలయం విధ్వంసం సృష్టించింది. శిథిలాల కింద చిక్కుకున్న ఎంతో మంది ప్రజలను మీరు ప్రాణాలకు తెగించి కాపాడటం చూశాను. ఆహారం లేకపోయినా బిస్కెట్లు తింటూ సరిపెట్టుకుంటున్నారు. బాధితులను కాపాడడానికి వంతెనలు నిర్మిస్తున్నారు. ప్రజల ప్రాణాల కోసం మీరు శ్రమిస్తున్న తీరు చూస్తుంటే గర్వంగా ఉంది. నేను కూడా ఏదో ఒకరోజు సైన్యంలో చేరి మీలాగా దేశాన్ని రక్షిస్తాను' అని రాసుకొచ్చాడు. బాలుడి లేఖను అందుకున్న ఆర్మీ అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. ఇటువంటి వారు ఇచ్చే ప్రేరణ వల్ల తాము దేశం కోసం మరింత కష్టపడి పని చేయాలనే ఇష్టం పెరుగుతుందని పేర్కొంటూ... బాలుడి లేఖను సోషల్ మీడియాలో పంచుకున్నారు. 'డియర్ రాయన్ నువ్వు హృదయపూర్వకంగా రాసిన మాటలు మమ్మల్ని భావోద్వేగానికి గురి చేశాయి. దేశ ప్రజలకు ఎటువంటి ఆపద వచ్చినా వారికి తోడుగా ఉండాలనేదే మా లక్ష్యం. మీ లేఖ మా లక్ష్యాన్ని పునరుద్ఘాటిస్తోంది. ఇటువంటి వారు ఇచ్చే ప్రేరణతో మేము మరింత ఉత్సాహంగా పని చేస్తాం. నువ్వు ఆర్మీ యూనిఫామ్ ధరించి, మాతో కలిసి నిలబడే రోజు కోసం ఎదురు చూస్తుంటాం. అప్పుడు దేశ ప్రజల కోసం కలిసి పోరాడదాం. నీ ధైర్యానికి, స్ఫూర్తికి ధన్యవాదాలు' అంటూ పేర్కొన్నారు. కాగా ఈ పోస్ట్ వైరల్ అవుతుండడంతో సైనికులు చేస్తున్న సేవలకు నెటిజన్లు తలవంచి నమస్కరిస్తున్నారు. కాగా మారుమూల ప్రాంతాల్లో శిథిలాల్లో చిక్కుకున్న ప్రజలను కాపాడడానికి ఆర్మీ అధికారులు రాత్రి, పగలు తేడా లేకుండా తీవ్రంగా శ్రమిస్తున్నారు.

సీఎం కార్యాలయాన్ని పేల్చేస్తామని బెదిరింపు

పాట్నా: బీహార్ సీఎం నితీశ్‌కుమార్ కార్యాలయానికి గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపు ఈ మెయిల్స్ పంపారు. సీఎం ఆఫీస్‌ను బాంబుతో పేల్చేస్తామని, బీహార్ స్పెషల్ పోలీసులు కూడా తమను అడ్డుకోలేరని ఆ మెయిల్స్‌లో హెచ్చరించారు. తాము అల్ కాయిదాకు సంబంధించిన వాళ్లమని పేర్కొన్నారు. గత నెల 16న వచ్చిన ఈ బెదిరింపు మెయిల్ గురించి సీఎం ఆఫీస్ అధికారులు ఆదివారం వెల్లడించారు. బెదిరింపు ఈమెయిల్‌పై బీహార్ పోలీసులు, ఉగ్రవాద వ్యతిరేక దళం దర్యాప్తు జరుపుతున్నాయి. సచివాలయ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మెయిల్ చేసిన గుర్తు తెలియని వ్యక్తిని గుర్తించే పనిలో ఉన్నట్లు తెలిపారు.

ఇంట్లో భార్యను చంపి... ఆపై భవనంపై నుంచి దూకి వ్యక్తి ఆత్మహత్య

ముంబై: ఒక వ్యక్తి తన ఇంట్లో భార్య గొంతునొక్కి హత్య చేశాడు. ఆ తర్వాత బిల్డింగ్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి ముందు వేరే ప్రాంతంలో పని చేస్తున్న కుమారుడి కోసం ఫ్లైట్ టికెట్ బుక్ చేశాడు. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ ఘటన జరిగింది. గోరేగావ్‌లో అపార్ట్‌మెంట్ ముందున్న రోడ్డుపై 58 ఏళ్ల వ్యక్తి శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కాగా, మృతుడిని కిషోర్ పెడ్నేకర్‌గా పోలీసులు గుర్తించారు. జిమ్ ఎక్విప్‌మెంట్ సేల్స్‌మెన్‌గా పని చేసేవాడని తెలుసుకున్నారు. అతడి మరణం గురించి ఆయన భార్యకు చెప్పేందుకు పలుమార్లు ఆమెకు ఫోన్ చేశారు. ఆమె ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆ ఫ్లాట్‌కు పోలీసులు చేరుకున్నారు. లోపల నుంచి డోర్ లాక్ చేసి ఉన్నట్లు గ్రహించారు. మృతుడి మెడలో లాకెట్‌గా ఇంటి తాళం చెవి ఉన్నట్లు గమనించారు. మరోవైపు ఆ కీతో డోర్ తెరిచిన పోలీసులు ఆ ఇంటి లోపలకు వెళ్లారు. థెరపిస్ట్ అయిన కిషోర్ భార్య రాజశ్రీ (57) మృతదేహాన్ని చూసి షాక్ అయ్యారు. మనస్తాపంలో ఉన్న భర్త కిషోర్ తన భార్య గొంతునొక్కి చంపి ఆ తర్వాత అపార్ట్‌మెంట్ పైనుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. దీనికి ముందు ఢిల్లీలో పని చేస్తున్న కొడుకు కోసం ముంబైకి విమాన టికెట్‌ను బుక్ చేశాడని, అతడి బ్యాంకు ఖాతాల వివరాలను వాట్సాప్ ద్వారా దగ్గరి బంధువుకు పంపినట్లు పోలీసులు తెలుసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పద పోస్ట్‌పై థరూర్ వివరణ



తిరువనంతపురం: ఆకస్మిక వరదలతో అల్లకల్లోలమైన వయనాడ్ ప్రాంతంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ పర్యటించారు. బాధితులను పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. తనవంతుగా కొంత సహాయ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా తన పర్యటనను 'మరపురానిది'గా పేర్కొంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. వందలాది మంది మృతి మీకు మరపురాని పర్యటనను మిగిల్చిందా అని విమర్శించారు. దీనిపై శశి థరూర్ వివరణ ఇచ్చారు. 'మెమోరబుల్' అంటూ తాను ఉపయోగించిన పదానికి ఉన్న అర్థాన్ని వివరించారు. గుర్తుంచుకోదగిన, గుర్తుండిపోయే సంఘటనను 'మెమోరబుల్'గా వ్యవహరిస్తామని తెలిపారు. ఆయా ఘటనలకు ఉన్న ప్రత్యేకత లేదా అవి మర్చిపోలేని జ్ఞాపకాలను మిగిల్చినప్పుడు ఆ పదాన్ని వాడతామని తెలిపారు. పరోక్షంగా వయనాడ్ వరదలు బాధాకరమైన జ్ఞాపకాలను మిగిల్చాయని ఆయన చెప్పుకొచ్చారు. స్వయంగా తానే ఓ మినీ ట్రక్కుల్లో సహాయ సామగ్రిని నింపారు. ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారిని ఓదార్చారు. వీటన్నింటికీ సంబంధించిన వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేస్తూ 'మెమోరబుల్' అనే క్యాప్షన్‌ను జోడించారు. దీనిపై బీజేపీ సీనియర్ నేత అమిత్ మాలవీయ మండిపడ్డారు. శశి థరూర్‌కు మరణాలు, మారణహోమం చిరస్మరణీయ జ్ఞాపకాలు అని ఎద్దేవా చేశారు.

అంతరిక్షంలో అద్భుత నిధి

కోట్ల విలువైన బంగారం, ప్లాటినం నిక్షేపాలు: నాసా



న్యూఢిల్లీ: నాసా ఇప్పుడు అంతరిక్షంలో ఒక అద్భుత నిధిని కనుగొంది. వందల కోట్ల రూపాయల విలువైన బంగారం, ప్లాటినం, ఇతర విలువైన లోహాలను అన్వేషించింది. 1852లో అన్నీబలే డి గాస్పరిస్ కనుగొన్న గ్రహశకలం16 సైకిపై 140 మైళ్ల వ్యాస పరిధిలో బంగారం, నికెల్, ప్లాటినం లోహాలు ఉన్నట్టు కనుగొన్నారు. అంగారక, గురు గ్రహాల మధ్య ఉన్న ఈ గ్రహ శకలంలో 1,00,000 డాలర్ల క్వాడ్రిలియన్ విలువైన లోహాలు ఉన్నట్టు నాసా తెలిపింది. ఈ విషయం శాస్త్రవేత్తలు, అంతరిక్ష ఔత్సాహికులను ఆశ్చర్యపరిచింది. అయితే వీటిని వెలికితీయడానికి పలు ఆర్థిక, సాంకేతిక సవాళ్లు ఎదురవుతాయని పేర్కొంటున్నది. 2029 నాటికి ఆస్టరాయిడ్‌లను చేరుకునే లక్ష్యంతో నాసా సైకి మిషన్‌ను 2023 అక్టోబరు 13న ప్రారంభించింది. తన పరిశోధనలో భాగంగా గ్రహశకలం 16 సైకిపై అపారంగా బంగారం, ప్లాటినం, నికెల్ వంటి ఖరీదైన లోహాలు ఉన్నట్టు నాసా నిర్ధారించింది. అవి తప్పి భూమి మీదకు తేగలిగితే ప్రపంచ దేశాల స్థితిగతులే మారిపోతాయని పేర్కొంటున్నది.

మహారాష్ట్రలో మారుతున్న సమీకరణలు!

అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం ఏక్‌నాథ్ షిండేను కలిసిన పవార్

ముంబై : ఈ ఏడాది చివర్లో జరిగే మహారాష్ట్ర ఎన్నికలకు పార్టీలు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నాయి. 288 స్థానాలున్న అసెంబ్లీకి అక్టోబరులో ఎన్నికలు జరగవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ముఖ్యమంత్రి అధికార నివాసంలో వీరిరువురి భేటీ జరిగింది. మరాఠా రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలు చర్చల్లో ప్రస్తావించినట్టు పైకి చెప్పినా, వీరి భేటీ పూర్తిగా రాజకీయాలకు సంబంధించినదేనని భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు వీరిద్దరూ ఇలా కలుసుకోవడం అసెంబ్లీ ఎన్నికల్లో కొత్త పొత్తులకు ఏమన్నా తెరతీస్తారా అన్న చర్చలు ప్రారంభమయ్యాయి.

ప్రత్యామ్నాయాలపై పార్టీల దృష్టి

గత కొద్ది సంవత్సరాలుగా మహారాష్ట్రలో అస్థిర ప్రభుత్వం అధికారంలో ఉండటం, తరచూ అధికారం చేతులు మారటంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓటింగ్ ద్వారా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమ పార్టీపై బీజేపీ చూపుతున్న వైఖరి పట్ల షిండే వర్గం అసంతృప్తితో ఉంది. బీజేపీతో బంధం తెంపుకుని శరద్‌పవార్‌తో కలిస్తే ఎలా ఉంటుందన్న అంశాన్ని షిండే పరిశీలించారని, అందులో భాగంగానే షిండే, పవార్‌ల భేటీ జరిగిందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

కుటుంబ తగాదాలే హర్‌ప్రీత్ సింగ్ హత్యకు కారణం

చండీగఢ్: స్థానిక కోర్టులో ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్ అధికారి హర్‌ప్రీత్ సింగ్ హత్యకు కుటుంబ తగాదాలే కారణమని పోలీసుల విచారణలో తేలింది. అదే విషయమై ఇద్దరి మధ్య కోర్టు ఆవరణలో రాజీ ప్రయత్నాలు జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హతుడు హర్‌ప్రీత్ సింగ్ (37) ఇండియన్ సివిల్ అకౌంట్స్ సర్వీస్ అధికారి. ఆయనకు, మాజీ పోలీస్ అధికారి అయిన ఆయన మామ మాల్విందర్ సింగ్ సంధూ సొంత మామా అల్లుళ్లు. కుటుంబ తగాదా నేపథ్యంలో రెండు కుటుంబాలు చండీగఢ్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించాయి. దాంతో శనివారం రెండు కుటుంబాల వారిని కూర్చోబెట్టి మధ్యవర్తులు రాజీకి ప్రయత్నాలు చేశారు. ఈ క్రమంలోనే మామ తనకు మూత్రం వస్తున్నదని చెప్పి, టాయిలెట్ చూపించేందుకు అల్లుడి రమ్మన్నాడు. దాంతో అల్లుడి వెంట వెళ్లగా తనకు దగ్గరున్న పిస్తోల్‌తో ఐదు రౌండ్ల కాల్పులు జరిపాడు. అందులో రెండు బుల్లెట్‌లు హర్‌ప్రీత్‌కు తగిలి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమయానికి కోర్టులోని అంబులెన్స్ పనిచేయకపోవడంతో అరగంట కాలయాపన తర్వాత ఓ అడ్వకేట్ కారులో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

ఢిల్లీ మెట్రోలో ప్రయాణించిన మాజీ ప్రధాని

న్యూఢిల్లీ: జేడీఎస్ అధినేత, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆదివారం అక్కడి మెట్రోలో ప్రయాణించారు. మాజీ ప్రధాని తమతో ప్రయాణించడంతో ప్రయాణికులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేవెగౌడ అధికారులతో ముచ్చటిస్తూ మెట్రో సేవల గురించి తెలుసుకున్నారు. కాగా ఢిల్లీలో ప్రధాని మోదీ ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రుల మ్యూజియాన్ని దేవెగౌడ శనివారం సందర్శించారు. దానికి సంబంధించిన విషయాలను సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పంచుకున్నారు. "ఢిల్లీలోని ప్రధాన మంత్రుల మ్యూజియాన్ని సందర్శించాను. ఇది ఒక అపూర్వమైన అనుభవం. మన ప్రధానులు దేశ అభివృద్ధికి అందించిన సహకారాన్ని, వారి భిన్న నేపథ్యాలను తెలియజేస్తూ ఈ మ్యూజియం ఏర్పాటు చేయడం అభినందనీయం" అని ఆయన పేర్కొన్నారు. కర్ణాటకలోని మారుమూల గ్రామంలోని పేద రైతు కుటుంబానికి చెందిన తాను దేశ ప్రధాని కావడానికి, ఈ మ్యూజియంలో చోటుదక్కించుకోవడానికి ప్రజలే అండగా నిలిచారని తెలిపారు.

గోడ కూలి 9 మంది చిన్నారులు మృతి

భోపాల్: శివలింగాన్ని తయారు చేయ దానికని ఆలయ ప్రాంగణానికి చేరుకున్న 9మంది చిన్నారులను గోడ రూపంలో మృత్యువు కబళించింది. షాపురా ప్రాంతంలోని హర్దోయ్ శివాలయం వద్ద పెద్ద సంఖ్యలో పాఠశాల విద్యార్థులు గుమిగూడారు. అక్కడ సావన్ మాసంలో శివుని ఆరాధనతో పాటు భగవత్ కథ కూడా నిర్వహిస్తారు. విద్యార్థులు శివలింగాన్ని తయారు చేస్తున్న ఆలయ ప్రాంగణానికి సమీపంలోనే మల్లు కుష్వాహ అనే వ్యక్తికి పురాతన ఇల్లు ఉంది. భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో 50 ఏళ్ల నాటి ఇంటి గోడ ఆకస్మాత్తుగా కూలిపోయి ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 9 మంది చిన్నారులు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ విషాద ఘటన మధ్యప్రదేశ్ లోని సాగర్‌లో చోటుచేసుకుంది. మరణిం చిన వారిలో 10 నుంచి 14 ఏళ్లలోపు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన చిన్నారులను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఈ ఘటనపై విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గోపాల్ భార్గవ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ఘటనపై సంతాపం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ బాధితుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. ఆదివారం కావడంతో సాగర్‌లోని పాఠశాలలకు సెలవు. దీంతో శివలింగాన్ని తయారు చేసేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ప్రధాన రిజర్వాయర్ల వెలవెల

- సగటు నీటిమట్టం గత ఏడాదికన్నా తక్కువే
- వరదలొచ్చినా పెరిగింది కొంతే...
- తెలుగు రాష్ట్రాల్లోనూ లోటే !

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు, వరదలు సంభవించినప్పటికీ భారతదేశంలోని 150 ప్రధాన రిజర్వాయర్లలో సగటు నీటి మట్టం గత సంవత్సరం కంటే తక్కువగానే ఉంది. అయితే గత దశాబ్దపు స్థాయి కంటే ఎక్కువగా ఉంది. కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ) వివరాల ప్రకారం, దేశంలోని వివిధ ప్రాంతాలలో నీటి నిల్వ స్థాయిలలో గణనీయమైన వ్యత్యాసాలు సానుకూల, సంబంధిత ధోరణులను ప్రతిబింబిస్తున్నాయి. 150 పర్యవేక్షించబడిన రిజర్వాయర్‌ల మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం 178.784 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) ఇది దేశవ్యాప్తంగా సృష్టించబడిన 257.812 బీసీఎంలో 69.35 శాతం. సీడబ్ల్యూసీ నివేదిక ప్రకారం, ఈ రిజర్వాయర్లలో అందుబాటులో ఉన్న ప్రత్యక్ష నిల్వ 91.496 బీసీఎం లేదా వాటి మొత్తం సామర్థ్యంలో 51 శాతం. గత ఏడాది ఇదే కాలంలో నమోదయిన నిల్వ స్థాయిలలో ఇది 94 శాతం, గత దశాబ్దపు సగటు ఆధారంగా సాధారణ నిల్వలో 107 శాతం. గత వారంతో పోల్చితే, జులై 25 బులెటిన్ ప్రకారం, ఈ రిజర్వాయర్‌లలో అందుబాటులో ఉన్న ప్రత్యక్ష నిల్వ 69.27 బీసీఎం ఇది మొత్తం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంలో 39 శాతం. గత సంవత్సరం ఇదే కాలంలో ప్రత్యక్ష నిల్వ 83.987 బీసీఎం, సాధారణ నిల్వ 72.411 బీసీఎంగా ఉంది. ఆ విధంగా ఈ వారం నిల్వ స్థాయిలు మునుపటి వారం కంటే పెరుగుదలను సూచిస్తున్నప్పటికీ గత సంవత్సరం సంబంధిత కాలం, సాధారణ నిల్వ రెండింటి కంటే తక్కువగా ఉన్నాయి. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, రాజస్తాన్‌లను కలిగి ఉన్న ఉత్తర ప్రాంతంలో మొత్తం 19.663 బీసీఎం సామర్థ్యంతో 10 రిజర్వాయర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆయా రాష్ట్రాలు 6.532 బీసీఎంను కలిగి ఉన్నాయి. ఇది వాటి సామర్థ్యంలో 33 శాతం. గత సంవత్సరం 76 శాతం కంటే గణనీయంగా తక్కువగా ఉంది. ఈ కాలానికి సాధారణ నిల్వ 53 శాతం. ఈ ప్రస్తుత స్థాయి మునుపటి వారం నిల్వ 5.786 బీసీఎం (సామర్థ్యంలో 29 శాతం) కంటే పెరుగుదలను సూచిస్తుంది. అసోం, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, నాగాలాండ్, బీహార్‌తో కూడిన తూర్పు ప్రాంతంలో 20.430 బీసీఎం సామర్థ్యంతో 23 రిజర్వాయర్‌లు ఉన్నాయి. అవి ప్రస్తుతం 6.989 బీసీఎం లేదా 34 శాతం సామర్థ్యంతో గత సంవత్సరం 31 శాతం కంటే మెరుగుపడింది. కానీ సాధారణ నిల్వ 39 శాతం కంటే తక్కువగా ఉంది. ఈ వారం నిల్వ మునుపటి వారం 5.630 బీసీఎం (సామర్థ్యంలో 28 శాతం) కంటే పెరిగింది. పశ్చిమ ప్రాంతం గుజరాత్, మహారాష్ట్ర 49 రిజర్వాయర్ల మొత్తం సామర్థ్యం 37.130 బీసీఎం కాగా అవి 19.863 బీసీఎం లేదా 53 శాతం సామర్థ్యంతో ఉన్నాయి. గత సంవత్సరం 63 శాతం కంటే తగ్గాయి కానీ సాధారణ నిల్వ 48 శాతం కంటే మెరుగ్గా ఉన్నాయి. ఈ వారం నిల్వ మునుపటి వారం 15.274 బీసీఎం (సామర్థ్యంలో 41 శాతం) నుంచి పెరుగుదలను చూపుతుంది. ఇక ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్‌తో కూడిన మధ్య ప్రాంతంలో మొత్తం 48.227 బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం) సామర్థ్యంతో 26 రిజర్వాయర్లు ఉన్నాయి. అయితే ఆ జలాశయాలు ప్రస్తుతం 23.102 బీసీఎం లేదా 48 శాతం సామర్థ్యంతో గత సంవత్సరం 55 శాతం, సాధారణ నిల్వ 50 శాతం కంటే తక్కువ నీటి నిల్వను కలిగి ఉన్నాయి. ఈ వారం నిల్వ మునుపటి వారం 16.042 బీసీఎం (సామర్థ్యంలో 33 శాతం) కంటే పెరిగింది.

దక్షిణాదిన 42 రిజర్వాయర్లలో 26 బీఎంసీలు

ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడుతో కూడిన దక్షిణ ప్రాంతంలో మొత్తం 53.334 బీఎంసీ సామర్థ్యంతో 42 రిజర్వాయర్లు ఉన్నాయి. అయితే ప్రస్తుతం 35.010 బీఎంసీ లేదా 66 శాతం సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ఇది గత సంవత్సరం 50 శాతం. సాధారణ నిల్వ 47 శాతం కంటే మెరుగ్గా ఉంది. ఈ వారం నిల్వ మునుపటి వారం 26.538 బీఎంసీ (సామర్థ్యంలో 50 శాతం) నుంచి పెరుగుదలను చూపుతుంది. గత ఏడాదితో పోలిస్తే కొన్ని రాష్ట్రాలు మెరుగైన నిల్వ స్థాయిలను చూపించాయి. అసోం, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, నాగాలాండ్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, కర్నాటక, కేరళ, తమిళనాడు వాటిలో కొన్ని. అయితే దీనికి భిన్నంగా రాజస్తాన్, బీహార్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, మధ్య ప్రదేశ్, గుజరాత్, ఉత్తరాఖండ్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ వంటి రాష్ట్రాలు తక్కువ నిల్వ స్థాయిలను నివేదించాయి.

హైవే సరే... మట్టిరోడ్డు కావాలి

సరిహద్దు గోడ నిర్మించొద్దు: గడ్కరీకి నారాయణ లేఖ



న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు-తచ్చూరు మధ్య నిర్మించే ఆరు లేన్ల హైవే పక్కనే వ్యవసాయ భూముల యజమానుల వినియోగార్థం మట్టిరోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఒక లేఖను సీపీఐ కార్యదర్శి కె.నారాయణ రాశారు. సాగు భూముల గుండా ఈ రహదారి వెళుతోందని గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. 'ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రకారం అండర్ పాస్‌లు, కల్వర్టులను గ్రామంలోని తారు రోడ్డులు/ మట్టి రోడ్డుల వద్ద ఏర్పాటు చేస్తామని ఉంది. క్రాస్ రోడ్డులు ఉన్న చోట ఎలాంటి సౌకర్యాలు కల్పించలేదు. రైతులు, పశువులు, ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు ఎడమ పక్క నుంచి కుడివైపు ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేదు. అంతేకాక ఐదు అడుగుల ఎత్తైన కాంక్రీటు సరిహద్దు గోడ నిర్మాణాన్ని కాంట్రాక్టరు మొదలు పెట్టారు. దీంతో ప్రధాన రాహదారి ఇరువైపుల ఉన్న పొలాల్లోకి వెళ్లేందుకు యజమానులకు అవకాశం లేకుండా పోయింది. వారి భూములు రెండుగా చీలిపోయాయి. గోడ నిర్మాణం గురించి గ్రామ ప్రజలకు అవగాహన లేదు. హైవే పక్క తమ కోసం మట్టి రోడ్డు ఉంటుందని వారంతా భావించారు కానీ ఇప్పుడు గోడ కడుతుండటంతో ఆందోళనకు గురవుతున్నారు. గోడ నిర్మాణాన్ని ఆపేయాలని కోరుతున్నారు. వ్యవసాయ భూముల్లోకి వెళ్లేందుకు మార్గం లేకపోవడానికి తోడు కొందరి భూములు ఈ రహదారి కారణంగా చీలిపోవడంపై అసహనానికి గురవుతున్నారు. వ్యవసాయోత్పత్తులు, ఎరువులు, పశువుల తరలింపుకు ఇబ్బంది పడుతున్నారు. గోడ నిర్మాణం వృథా ప్రయాస. ఖర్చు తప్ప పెద్దగా ప్రయోజనం ఉండదు. జాతీయ మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టుల కోసం తమ సారవంత భూములు ఇచ్చేలా గ్రామ ప్రజలతో మాట్లాడి నేను ఒప్పించాను. వార్షిక పంటోత్పత్తిని నష్టపోతున్నా ప్రభుత్వమిచ్చే తక్కువ పరిహారాన్ని వారు అంగీకరించారు. అయితే తాజా పరిణామాలతో భూములు ఇచ్చిన వారంతా నా వద్దకు వచ్చి రహదారి ఇరు పక్కల మట్టి రోడ్లను నిర్మించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులపై ఒత్తిడి తేవాలని కోరుతున్నారు. అందుకే విషయాన్ని మీ దృష్టికి తీసుకొచ్చా. స్థానికుల సౌకర్యార్థం చర్యలు తీసుకోగలరని ఆకాంక్షిస్తున్నా. గోడ నిర్మాణాన్ని నిలిపివేసి, మట్టి రోడ్డు వేసి... ట్రాక్టర్లు, పశువల రాకపోకలకు సౌకర్యం కల్పిస్తారని ఆశిస్తున్నా' అని లేఖలో నారాయణ పేర్కొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-విజయవాడ: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం విజ్ఞప్తి చేశారు. కీలకమైన రెవెన్యూ శాఖలో పని చేస్తున్న వీఆర్‌ఏలను నాల్గవ తరగతి ఉద్యోగులుగా పరిగణించి పే స్కేల్ వర్తింప చేయాలని కోరుతూ మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం సీఎం చంద్రబాబు నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడి యాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అత్యంత నిరాదరణకు గురైన వీఆర్‌ఏలను తక్షణం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వాలు వీఆర్‌ఏలు చేత పూర్తి కాలం పని చేయించుకుంటూ వేతనం విషయంలో పార్ట్ టైం వేతనం ఇవ్వడం అత్యంత అన్యాయం అన్నారు. వీఆర్‌ఏల్లో అత్యధికులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు చెందిన పేదలే ఉన్నారన్నారు. వీఆర్‌ఏల సమస్యలపై తక్షణం స్పందించి, పాలనలో విధానపరమైన నిర్ణయం తీసుకోక ముందే వీఆర్‌ఏలకు పే స్కేల్ మంజూరు చేయాలని, నామినీలుగా ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని, అటెండర్, వాచ్‌మెన్, డ్రైవర్లు, వీఆర్‌ఏ పదోన్నతులను కల్పించాలని సీఎంకు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినట్లు నాగేశం తెలిపారు.

భూ బాధితులకు అండగా పోరాడతాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- మదనపల్లె సదస్సుకు భారీగా తరలివచ్చిన బాధితులు
- 20న విజయవాడలో మరో సమావేశం

విశాలాంధ్ర-మదనపల్లె: రెవెన్యూ భూ బాధితులకు అండగా పోరాడతామని, రెవెన్యూ అధికారులు, భూకబ్జా దారులు కలిసి చేసిన అవినీతి, అక్రమాలు బయటపడకుండా ఉండేందుకే ప్రభుత్వ రికార్డులను తగులబెట్టారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ తెలిపారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రభుత్వ రికార్డుల కాల్చివేత ఘటనను నిరసిస్తూ ఆదివారం సీపీఐ అధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లోని రాజ్ భవన్ ఫంక్షన్ హాలు నందు రెవెన్యూ భూ బాధితులతో సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు అధ్యక్షత వహించారు. సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ రాజకీయ పలుకుబడితో పేద ప్రజల భూములను లాక్కున్నారని విమర్శించారు. అనేక మంది పేదలు తమ భూములను బలవంతంగా లాక్కున్నారని, మా భూములు మాకు ఇప్పించండి అని మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో భూ ఆక్రమణలు జరిగినట్లు చాలామంది బాధితులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు రామకృష్ణ చెప్పారు. వీటన్నిటిపై ఇదివరకే సీఎం చంద్రబాబు నాయుడుతో మాట్లాడటం జరిగిందన్నారు. బాధితులకు సీపీఐ అండగా నిలబడుతుందని, రెవెన్యూ భూ బాధితులతో ఈ నెల 20న విజయవాడలో మరో సమావేశం ఏర్పాటు చేసి, వారి సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతామన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవన్యూ అధికారులు, భూకబ్జాదారులు కలిసి రాజకీయ అండదండలతో వెయ్యి ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములు వాగులు, వంకలు, చెరువులు కబ్జాలు చేశారని, ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ రికార్డులను పూర్తిగా కాల్చివేశారని విమర్శించారు. రెవెన్యూ శాఖలోని కొంతమంది అవినీతి అధికారుల సహకారంతోనే ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని తెలిపారు. గతంలో అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పని చేసిన గిరీశ పైన కూడా విచారణ జరిపించాలన్నారు. రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియాకు మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఒక్కరోజే 500కు పైగా ఫిర్యాదులు వచ్చాయని, రెవెన్యూ డివిజన్ పరిధిలో వేలాది మంది పేదలు కబ్జాదారులు కోరల్లో చిక్కుకున్నారని, వీరందరికీ విముక్తి కలిగించాలని కోరారు. భూ బాధితుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సీపీఐ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం మదనపల్లె, పీలేరు నియోజకవర్గంలోని భూ బాధితులు వారి సమస్యలను రామకృష్ణ దృష్టికి తీసుకొచ్చి అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మహేష్, కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబశివ, మనోహర్ రెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు రూ.10 వేల జీతం

మంత్రి కొల్లు రవీంద్రకు రాజేంద్రబాబు, గోవిందరాజులు వినతి

విశాలాంధ్ర-విజయవాడ: వలంటీర్లకు న్యాయం చేయాలని మంత్రి కొల్లు రవీంద్రకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, ఆంధ్రప్రదేశ్ వలంటీర్స్ అసోసియేషన్ ఏపీ కన్వీనర్ లంక గోవిందరాజులు విజ్ఞప్తి చేశారు. ఇద్దరు నేతలు ఆదివారం మంత్రితో విజయవాడ కార్యాలయంలో భేటీ అయి వలంటీర్ల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లకు రూ.10,000 జీతం, ఉద్యోగ భద్రత కల్పనకు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని కోరినట్లు తెలిపారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, బలవంతంగా రాజీనామాలు చేసిన వారిని గుర్తించి, తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేశామన్నారు. ఎన్నికల వేళ లక్ష మందికిపైగా వలంటీర్లతో బలవంతంగా రాజీనామా చేయించారని మంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వలంటీర్ల సమస్యలను ప్రభుత్వానికి వివరిస్తానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

సంక్షేమ గృహాల్లో వసతులు కల్పించాలి

రేపు కలెక్టరేట్‌ల వద్ద ఏఐఎస్ఎఫ్ నిరసన

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు వీ జాన్సన్ బాబు, కే శివారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక దాసరి భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ... ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో వసతి గృహాలను సందర్శించినట్టు చెప్పారు. విద్యార్థులు కటిక నేలపై నిద్రిస్తున్నారన్నారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన చేపడుతున్నాట్టు పేర్కొన్నారు. యావత్ విద్యార్థి, విద్యార్థినీలు ప్రత్యక్షంగా నిరసనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాలు, నిద్రపోవడానికి సరిపడ గదులు... మరుగుదొడ్లు లేకపోవడం తదితర సమస్యలతో విద్యార్థులు సతమతమౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, సాదిక్, కరిముల్లా, అయ్యప్ప పాల్గొన్నారు.

కార్పొరేట్ సంపద... కార్మికులకు పంపిణీ

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: కార్పొరేట్ శక్తుల దగ్గర ఉన్న 90శాతం సంపదను కార్మికవర్గానికి పంచాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మిక, రైతు సంఘాలు ఈనెల 9న తలపెట్టిన 'క్విట్ కార్పొరేట్' నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరంలో క్విట్ ఇండియా ఉద్యమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తుచేశారు. దేశంలో కార్పొరేట్ దోపిడీ సాగుతోందన్నారు. దేశాభివృద్ధికి వెచ్చించాల్సిన సంపదను తమ వద్ద పెట్టుకున్న కొందరు... పారిశ్రామిక, వ్యవసాయ రంగాలను శాసించాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. మోదీ ప్రభుత్వం కూడా వారికే వత్తాసు పలుకుతోందని విమర్శించారు. రైతులు, కార్మికుల ప్రయోజనాలను పణంగా పెట్టి నల్ల సాగు చట్టాలు, కార్మిక కోడ్లు తెచ్చి కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడమే మోదీ ప్రభుత్వ ఉద్దేశమని రవీంద్రనాథ్ పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌లోనూ పెట్టుబడిదారులకు రాయితీలు, పన్నుల మినహాయింపులు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ ధోరణి స్పష్టమైందన్నారు. రైతులు, కార్మికుల వ్యతిరేక చట్టాల రద్దు వరకు ఐక్య పోరాటాలను మరింత ఉధృతంగా సాగించాలని పిలుపునిచ్చారు. అలాగే ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే ఆందోళనలలో రైతులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని రవీంద్రనాథ్ కోరారు.

జర్నలిస్టులకు వేజ్ బోర్డు అవసరం

ఐజేయూ డిమాండ్ న్యాయమైనదే
హర్యానా గవర్నర్ దత్తాత్రేయ

(పంచకుల నుంచి డి.సోమసుందర్)

వర్కింగ్ జర్నలిస్టుల వేజ్ బోర్డు పునరుద్ధరించాలన్న ఐజేయు డిమాండును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హామీ ఇచ్చారు. వర్కింగ్ జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలన్న డిమాండ్ కూడా న్యాయమైనదేనని దత్తాత్రేయ అభిప్రాయ పడ్డారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.
హర్యానాలోని పంచకులలో ఆగస్టు 3, 4 తేదీల్లో జరుగుతున్న ఐజేయూ జాతీయ కౌన్సిల్ సమావేశాలలో రెండోరోజు ఆదివారం ఉదయం జరిగిన సెషన్ కు బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ఐజేయు జాతీయ అధ్యక్షుడు కే శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. దత్తాత్రేయ మాట్లాడుతూ మీడియా మన ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని, మీడియా పటిష్టంగా ఉంటేనే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని అన్నారు. ప్రభుత్వాలు వస్తూ పోతూ ఉంటాయి... పార్టీలు వస్తుంటాయి, పోతుంటాయి కానీ దేశం శాశ్వతమని...దేశం వికాసం చెందాలంటే ప్రజాస్వామ్యం కీలకమని , అందుకు బలమైన మీడియా అవసరమని దత్తాత్రేయ అన్నారు. ప్రభుత్వాలు చేసే మంచిని, చెడును ప్రజల ముందుకు తెచ్చే బాధ్యత మీడియాదేనని ఆయన స్పష్టం చేశారు. నిబద్ధతతో పనిచేసే పాత్రికేయులను చూసి ముఖ్యమంత్రులు సైతం భయపడటం తనకు తెలుసునని, అలాంటి పాత్రికేయులను పిలిచి వారు లేవనెత్తిన సమస్యలపై మాట్లాడుకోవడం జరిగేదని దత్తాత్రేయ అన్నారు. తన దృష్టిలో పాలకులకంటే నిజం చెప్పే జర్నలిస్టే ఉన్నతుడని బండారు దత్తాత్రేయ అన్నారు. గతంలో ఎన్నో కుంభకోణాలను , అక్రమాలను, అవినీతిని వెలుగులోకి తేవడంలో పరిశోధనాత్మక జర్నలిజం ముఖ్య భూమిక పోషించిందని దత్తాత్రేయ గుర్తు చేశారు. అయితే వాస్తవాలను వెలుగులోనికి తెస్తే సహించలేని దుష్ట శక్తులు మీడియాపై దాడులు చేస్తుంటాయని దత్తాత్రేయ అన్నారు. నిజాలను నిర్భయంగా వెలుగులోకి తెచ్చే పాత్రికేయులకు భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, జర్నలిస్టుల భద్రతకు ప్రత్యేక చట్టం చేయాలన్న ఐజేయూ డిమాండు న్యాయబద్ధమేనని దత్తాత్రేయ పేర్కొన్నారు. ప్రత్యేక భద్రతా చట్టం డిమాండును కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని ఆయన హామీ ఇచ్చారు. వర్కింగ్ జర్నలిస్టులకు వేతన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు వేజ్ బోర్డు ఏర్పాటు ఆవశ్యకతను తన స్థాయిలో కేంద్రం దృష్టికి తీసుకు వెళతానని దత్తాత్రేయ హామీ ఇచ్చారు. ఇటీవల కాలంలో సాంకేతికత పెరుగుదల, కృత్రిమ మేధ ప్రవేశంతో మీడియా రంగంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. అయితే మీడియాకు విలువలు ప్రధానమని , విలువలు లేని మీడియాకు విశ్వసనీయత ఉండదని , విశ్వసనీయత లేని మీడియాకు గౌరవం ఉండదని , పాత్రికేయులు సమాచారాన్ని సమాచారంగా ఇవ్వాలని , న్యూస్ బదులు వ్యూస్ ఇవ్వడం మంచి పద్ధతి కాదని దత్తాత్రేయ అభిప్రాయపడ్డారు. ఐజేయు అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి తనకు నాలుగున్నర దశాబ్దాలుగా తెలుసునని, విలువలు కలిగిన జర్నలిస్టుగా , నిబద్ధత కలిగిన యూనియనిస్ట్ గా ఆయనంటే తనకు అపార గౌరవమని దత్తాత్రేయ పేర్కొన్నారు. సమావేశాలకు ఇరవై రాష్ట్రాల నుండి ప్రతినిధులు పాల్గొంటున్నట్లు, అందులో రెండు తెలుగు రాష్ట్రాల ప్రతినిధులు ఎక్కువగా ఉన్నట్లు తనకు చెప్పారని , అందువల్ల తెలుగులో కూడా మాట్లాడతానని దత్తాత్రేయ అన్నారు. ఆమేరకు కాసేపు తెలుగులో కూడా ఆయన మాట్లాడారు. అధ్యక్షత వహించిన కే శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సామాన్య కార్యకర్తగా ప్రారంభం అయిన బండారు దత్తాత్రేయ రాజకీయ ప్రస్థానాన్ని వివరించారు. ఎంపీగా ఉన్నా, కేంద్రమంత్రిగా ఉన్నా, ఎలాంటి భేషజాలు లేకుండా సామాన్య ప్రజలతో కలిసిమెలిసి మెలిగే నేతగా ,ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండే ప్రజా ప్రతినిధిగా , దత్తాత్రేయ ప్రజల మన్ననలు పొందారని, అన్ని రాజకీయ పార్టీలవారూ ఆయన్ని అభిమానిస్తారని వివరించారు. ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ బండారు దత్తాత్రేయ దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే "ఆలయ్ బలయ్" కార్యక్రమం పొందుతున్న ప్రాచుర్యాన్ని వివరించారు. ఉత్తర తెలంగాణా జిల్లాల్లో అటల్ బీహారీ వాజపేయి పాల్గొన్న సభల నిర్వాహకునిగా దత్తాత్రేయ, వార్తా సేకరణకు తానూ కొన్ని రోజులపాటు చేసిన పర్యటనలను గుర్తు చేశారు.
ఐ.జే.యు. స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎస్.ఎన్. సిన్హా మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టు చట్టాన్ని రద్దు చేయడంతో ఏర్పడిన పరిస్థితులను దత్తాత్రేయ దృష్టికి తెచ్చారు. ఐజేయు సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్మూ , చండీగఢ్, హర్యానా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు రామ్ సింగ్ బ్రార్, చైర్మన్ బల్వంత్ తక్షీ, చండీ ఘర్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు నళినీ ఆచార్య, ఐజేయూ జాతీయ కార్యదర్శి బల్బీర్ సింగ్ ఝూండు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయను ఐజేయు నాయకులు ఘనంగా సత్కరించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్ఫూర్తిదాయకం : కొనకళ్ల

హిందూ కళాశాల హైస్కూల్ 1981-82 బ్యాచ్ సందడే సందడి

విశాలాంధ్ర-మచిలీపట్నం టౌన్: హిందూ కళాశాల హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీ, హిందూ కళాశాలల చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. హిందూ కళాశాల హైస్కూల్ 1981-82 బ్యాచ్ పూర్వ విద్యార్థుల కన్వీనర్ జంధ్యాల శ్రీకృష్ణ నేతృత్వంలో ఏడో సమ్మేళనం ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని సరస్వతీ మందిరం కళావేదికపై ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా విచ్చేసిన కొనకళ్ల తాను విద్యనభ్యసించిన పాఠశాలలో ఈ సమ్మేళనంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్, చెన్నై, రాజమండ్రితో పాటు రాష్ట్రం నలుమూల నుంచి 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వీరంతా పరస్పరం కుశల ప్రశ్నలు వేసుకుని, నాటి మధుర స్మృతులను పంచుకున్నారు. పూర్వ విద్యార్థి, రంగనాయకస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ దేను సుబ్రహ్మణ్యం సమావేశానికి విచ్చేసిన పూర్వవిద్యార్థులను పరిచయం చేస్తూ ఛలోక్తులతో అద్భుతం నవ్వులు పూయించారు. తమతో విద్యనభ్యసించి హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఉన్నత స్థాయికి చేరిన మల్లీశ్వరిని ఘనంగా సత్కరించారు. ఈ సమ్మేళనంలో బాలాజీ విద్యాలయం కరస్పాండెంట్ కొమరగిరి చంద్రశేఖర్, ప్రముఖ వ్యాపార వేత్తలు మానేపల్లి సత్యనారాయణ, తమ్మన రవిశంకర్, ఎల్ఐసీ అధికారి జయశ్రీ, మాజీ కార్పొరేటర్ భోగిరెడ్డి వెంకటేశ్వరరావు, గొర్రె హరిబాబు, వివిధ ప్రాంతాల్లో వ్యాపార, ఉద్యోగ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు పాల్గొని అద్భుతంగా ఉల్లాసంగా గడిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.